


చంద్రబాబు విశాఖ రాక రేపు



విశాఖపట్నం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): 'రా...కదలిరా..' పేరుతో విజయనగరం జిల్లా బొబ్బిలిలో ఈనెల పదో తేదీన నిర్వహించనున్న బహిరంగ సభకు తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు హాజరుకానున్నారు. బుధవారం ఉదయం గన్నవరం నుంచి బయలుదేరి 11 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. ఆయన ఇక్కడ నుంచి హెలికాప్టర్‌లో బొబ్బిలి వెళతారని పార్టీ వర్గాలు తెలిపాయి. బొబ్బిలి సభ అనంతరం హెలికాప్టర్‌లో కాకినాడ జిల్లా తుని సమీపంలోని చామవరం వెళతారు. అక్కడ బహిరంగ సభలో పాల్గొంటారు.

ఎన్నికల నిర్వహణకు నోడల్ అధికారులు

16 మందిని నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు

త్వరలో తహసీల్దార్ల బదిలీ

విశాఖపట్నం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో రెండున్నరేళ్ల కంటే తక్కువ కాలం పనిచేసిన 16 మంది అధికారులను గుర్తించి నోడల్ అధికారులుగా నియమించారు. ఎన్నికల నిర్వహణకు సిబ్బంది నియామకం కోసం వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ వి.రవీంద్రను నోడల్ అధికారిగా నియమించారు. అలాగే సిబ్బందికి శిక్షణ కోసం డీఈవో ఎల్.చంద్రకళను, ఎన్నికల సామగ్రి పర్యవేక్షణకు జీవీఎంసీ యూసీడీ పీడీ పాపునాయుడును, రవాణాకు జిల్లా వ్యవసాయ అధికారి కె.అప్పలస్వామిని, కంప్యూటరైజేషన్, సైబర్ సెక్యూరిటీ కోసం జిల్లా సమాచార అధికారి ఎంజీ చంద్రశేఖర్‌ను నోడల్ అధికారులుగా నియమించారు. ఇంకా, పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్, శాంతిభద్రతల పర్యవేక్షణకు జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ ఎస్ఎస్ వర్మ, ఫిషరీస్ ఏడీ ఎం.విజయకృష్ణలను, ఈవీఎంల నిర్వహణకు జిల్లా సహకార అధికారి టి.ప్రవీణను, మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్టు పర్యవేక్షణకు జీవీఎంసీ కమిషనర్ సాయికాంతవర్మను, ఎన్నికల వ్యయ నియంత్రణ పరిశీలనకు జిల్లా ఆడిట్ అధికారి డీడీ ముల్లార్‌ను, బ్యాలెట్ పేపర్లు, పోస్టల్ బ్యాలెట్ ముద్రణకు సమగ్రశిక్ష అభియాన్ ఏపీసీ బి.శ్రీనివాసరావు, మీడియా బాధ్యతలకు జిల్లా ఉద్యానవన అధికారి కె.మన్మథరావును, కమ్యూనికేషన్ ప్లాన్‌కు జడ్పీ డిప్యూటీ సీఈవో డి.సత్యనారాయణను, ఓటర్ల జాబితా పర్యవేక్షణకు సివిల్ డిఫెన్స్ ఎస్డీసీ కె.పద్మలతను, ఓటర్ హెల్ప్‌లైన్, ఫిర్యాదులు, పరిష్కారం సెల్‌కు దివ్యాంగుల విభాగం ఏడీ జె.మాధవిని, ... మిగతా 6వ పేజీలో

నేడు జీవీఎంసీ బడ్జెట్ సమావేశం

- రూ.5,457.23 కోట్లతో తయారీ
- ఇప్పటికే స్టాండింగ్ కమిటీ ఆమోదం

విశాఖపట్నం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ బడ్జెట్ సమావేశం మంగళవారం జరగనున్నది. మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు కౌన్సిల్ ప్రత్యేకంగా సమావేశమై బడ్జెట్ ముసాయిదాపై చర్చించనున్నది. బడ్జెట్ ముసాయిదా ప్రతులను ఇప్పటికే సభ్యులకు అందజేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.5,457.23 కోట్లతో జీవీఎంసీ బడ్జెట్‌ను అధికారులు రూపొందించారు. ముసాయిదాను స్టాండింగ్ కమిటీ ఇప్పటికే ఆమోదించడంతో కౌన్సిల్ ఆమోదముద్ర వేస్తే రాష్ట్ర ప్రభుత్వ ఆమోదానికి పంపించనున్నారు. గత ఏడాదితో పోల్చితే 2024-25 బడ్జెట్‌లో ఇంజనీరింగ్ విభాగానికి కేటాయింపులు పెంచారు. మొత్తం బడ్జెట్‌లో 25 శాతానికిపైగా అంటే రూ.1,366.36 కోట్లు ఇంజనీరింగ్ విభాగానికే కేటాయించడం విశేషం. ఇది కాకుండా పలు కొత్తప్రాజెక్టులకు రూ.1,046.45 కోట్లు కేటాయింపులు చూపించడం విశేషం. మొత్తం బడ్జెట్‌లో రూ.176.09 కోట్లు సాధారణ పరిపాలన విభాగానికి, వీధిదీపాల నిర్వహణకు రూ.163.65 కోట్లు, టౌన్‌ప్లానింగ్ విభాగానికి రూ.63.41 కోట్లు, పార్కులు, శ్మశానాలు, సమాధుల పరిరక్షణ, అభివృద్ధికి రూ.181.35 కోట్లు, ప్రజారోగ్యానికి రూ.526.11 కోట్లు, నీటి సరఫరా విభాగానికి రూ.359.99 కోట్లు, అమృత్ పథకానికి రూ.504 కోట్లు, ఆర్థిక సంఘం నిధులతో చేసే పనుల కోసం రూ.498.4 కోట్లు కేటాయించారు.

కార్పొరేటర్లకు రూ.20 వేలు గిఫ్ట్ కూపన్లు

జీవీఎంసీ బడ్జెట్ సమావేశం నేపథ్యంలో ఒక్కో కార్పొరేటర్‌కు రూ.20 వేలు విలువైన గిఫ్ట్ కూపన్‌ను అందజేస్తున్నట్టు తెలిసింది. ఏటా బడ్జెట్ సమావేశం సమయంలో కార్పొరేటర్లకు ఏదో ఒక బహుమతి ఇస్తుంటారు. గత ఏడాది రూ.15 వేలు ఇవ్వగా, ఈ ఏడాది రూ.20 వేల గిఫ్ట్ కూపన్ ఇస్తున్నట్టు తెలిసింది. ఈ కూపన్‌ను జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ వాపసు ఇచ్చేసినట్టు సమాచారం.

విశాఖ రేంజ్‌లో 28 మంది సీఐల బదిలీ

- నగరానికి పది మంది రాక
- ఇక్కడ నుంచి ఎనిమిది మంది శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు... - వార్త I పేజీలో



హనుమంతవాక జంక్షన్‌లో సిగ్నల్ పడడంతో భారీగా నిలిచిపోయిన వాహనాలు

ఫ్లైఓవర్‌లపై పైపై మాటలేనా!?

నగరంలో 12 చోట్ల ఫ్లైఓవర్ బ్రిడ్జిలు నిర్మించనున్నట్టు మూడేళ్లుగా చెబుతున్న వైసీపీ నేతలు

- ఇప్పటివరకూ కార్యరూపం దాల్చని వైనం
- హనుమంతవాక జంక్షన్‌లో ఫ్లైఓవర్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్టు తాజాగా ప్రకటనలు
- డీపీఆర్‌లు లేకుండా నిర్మాణాలా!!
- నిధుల వ్యయంపై కొరవడిన స్పష్టత
- ఎన్నికల స్టంటేనా...

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

'అలు లేదు...చూలు లేదు. కొడుకు పేరు సోమలింగం' అన్నట్టుగా వైసీపీ నాయకులు వ్యవహరిస్తున్నారు. నగరంలో 12 ఫ్లైఓవర్ల నిర్మాణం చేపడతామంటూ గత మూడేళ్ల నుంచి ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ చెప్పుకొస్తున్నారు. ఢిల్లీకి వెళ్లి ప్రతిపాదనలు కూడా సమర్పించారు. అనేక ఒత్తిళ్ల నేపథ్యంలో కేంద్రం కూడా ఈ ప్రాజెక్టును చేపడతామని హామీ ఇచ్చింది. కానీ ఇంతవరకూ ఆ దిశగా ఎటువంటి అడుగులు ముందుకు పడలేదు. కానీ విశాఖ జిల్లా వైసీపీ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి మాత్రం త్వరలోనే హనుమంతవాక జంక్షన్‌లో ఫ్లైఓవర్ నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేస్తామంటూ పదేపదే చెబుతున్నారు. ఇది ఎలా సాధ్యమో అర్థం కావడం లేదు.

విశాఖ నగరం మీదుగా వెళుతున్న చెన్నై-కోల్‌కతా 16వ నంబర్ జాతీయ రహదారి భారత జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) ఆధ్వర్యంలో ఉంది. ఫ్లైఓవర్లు కేంద్ర ప్రభుత్వమే నిర్మించాలి. దానికి సీఎం జగన్ ఎలా శంకుస్థాపన చేస్తారో అర్థం కావడం లేదు. పోనీ ఈ రహదారిని ఏమైనా రాష్ట్రానికి అప్పగించారా?...అంటే అదీ లేదు. ఫ్లైఓవర్ల నిర్మాణం పూర్తయ్యాక ఎన్‌హెచ్ఏఐ రాష్ట్రానికి అప్పగిస్తుందని, ఆ తరువాత జీవీఎంసీ ఆ మార్గం నిర్వహణ బాధ్యతలు చేపడుతుందని జిల్లా కలెక్టర్ మల్లికార్జున మూడు రోజుల క్రితం స్వయంగా వెల్లడించారు. అంటే విశాఖ ప్రజలను మోసం చేయడానికి చివరి వరకు అధికార పార్టీ వైసీపీ యత్నిస్తున్నదనే అర్థమవుతోంది.

అది కూడా టీడీపీ నిర్మించిన ఫ్లైఓవరే

విశాఖపట్నంలో ... మిగతా 6వ పేజీలో

పెందుర్తి నుంచి అమర్‌కు చాన్స్?

పార్టీ వర్గాల్లో విస్తృతంగా ప్రచారం

మూడో జాబితాలో పేరు ఉంటుందంటున్న ఆయన అనుయాయులు



మంత్రి గుడివాడ అమర్‌నాథ్

- వాస్తవానికి ఎలమంచిలి లేదా చోడవరం నుంచి పోటీకి ఆసక్తి చూపిన మంత్రి
- సిట్టింగ్ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ శిబిరంలో కలకలం
- సిట్టింగ్ ఎమ్మెల్యేలు ససేమిరా అనడంతో పెందుర్తి వైపు చూపు



పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికలకు మరో మూడు నెలలు మాత్రమే సమయం ఉండడంతో అభ్యర్థుల ఎంపికపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం దృష్టిసారించింది. ఇప్పటికే రెండు విడతలుగా 38 మందిని ప్రకటించింది. తాజాగా మరో 22 మందితో మూడో విడత జాబితా విడుదల చేయబోతున్నట్టు పార్టీలో పెద్దఎత్తున ప్రచారం జరుగుతోంది. అందులో పెందుర్తి నుంచి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పేరును ఖరారు చేసినట్టు ప్రచారం జరుగుతోంది. ఇది సిట్టింగ్ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ వర్గీయుల్లో కలవరం రేపుతోంది.

వైసీపీ నెల రోజుల కిందట తొలివిడత 11 మందితో ఒక జాబితా విడుదల చేసింది. గాజువాక నియోజకవర్గానికి సిట్టింగ్ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని, ఆయన కుమారుడు దేవన్‌రెడ్డిని కాకుండా 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి రామచంద్రరావును సమన్వయకర్తగా నియమించింది. కొద్దిరోజుల కిందట 27 మంది అభ్యర్థులతో రెండో జాబితా విడుదల చేసింది. అందులో ఉమ్మడి జిల్లాకు సంబంధించి పాయకరావుపేట టికెట్‌ను సిట్టింగ్ ఎమ్మెల్యే గొల్ల బాబూరావుకు కాకుండా విజయనగరం జిల్లా రాజాం సిట్టింగ్ ఎమ్మెల్యే కంబాల జోగులుకు కేటాయించింది. తాజాగా మరో 22 మంది అభ్యర్థులతో మూడో జాబితాను సిద్ధం చేసినట్టు పార్టీ నేతలు చెబుతున్నారు. మూడో జాబితాలో పెందుర్తి అభ్యర్థిగా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పేరు ప్రకటించడం ఖాయమని అంటున్నారు. ఈ మేరకు రెండు రోజుల కిందటే అధిష్ఠానం నుంచి సంకేతాలు అందాయంటూ పేర్కొంటున్నారు. అయితే మంత్రి అమర్‌నాథ్ ఎలమంచిలి నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి చూపగా, అక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న కన్నబాబురాజు తీవ్రంగా వ్యతిరేకించారు. ఒకవేళ తనకు టికెట్ ఇవ్వకుండా వేరెవరికి ఇచ్చినా వారి ఓటమిని కృషిచేస్తానని పార్టీ ముఖ్య నేతలకు ఆయన తేల్చిచెప్పడంతో మంత్రి అమర్‌నాథ్ వెనకడుగు వేసినట్టు చెబుతున్నారు. రెండో ప్రాధాన్యంగా చోడవరం నుంచి పోటీకి మంత్రి అమర్‌నాథ్ ఆసక్తి చూపారు. తనను తొలగించి ఎవరికి టికెట్ ఇచ్చినా వారి విజయానికి సహకరిస్తానని, తన సామాజికవర్గానికి చెందిన మంత్రి అమర్‌నాథ్‌కు ఇస్తానంటే మాత్రం తాను అంగీకరించబోనని సిట్టింగ్ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పార్టీలో కీలక నేతకు స్పష్టంచేసినట్టు చెబుతున్నారు. దీంతో విధిలేని పరిస్థితిలో పెందుర్తి నుంచి పోటీకి అనుమతించాలని మంత్రి అమర్‌నాథ్ ... మిగతా 6వ పేజీలో

రైళ్లు ఫుల్

మొదలైన పండుగ తాకిడి

- హైదరాబాద్ నుంచి విశాఖ వచ్చే రైళ్లలో ఈనెల 14 వరకూ బెర్తులు నిల్
- ఈనెల 16 నుంచి 22 వరకు విశాఖ నుంచి సికింద్రాబాద్ వెళ్లే రైళ్లలో బెర్త్ లభించని పరిస్థితి
- ఈనెల 26 వరకూ బెంగళూరు, చెన్నై రైళ్లకు డిమాండ్
- చాంతాడంతా నిరీక్షణ జాబితాలు



విశాఖపట్నం, జనవరి 8: రైళ్లకు సంక్రాంతి ప్రయాణికుల తాకిడి మొదలైంది. విశాఖపట్నం నుంచి/మీదుగా హైదరాబాద్, చెన్నై, బెంగళూరు ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్న పలు రైళ్లలో ఈ నెల 22వ తేదీ వరకూ బెర్తులన్నీ రిజర్వు అయిపోయాయి. ప్రధానంగా ఆయా పట్టణాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల్లో స్థిరపడిన యువతీయువకులు పండుగకు సొంత ఊళ్లకు ప్రయాణం కావడంతో రద్దీ ఎక్కువగా ఉంది. హైదరాబాద్, సికింద్రాబాద్‌ల నుంచి విశాఖ వచ్చే రైళ్లలో ఈనెల 13వ తేదీ వరకు, ఇక పండుగ తర్వాత ఇటు నుంచి వెళ్లే రైళ్లకు చాంతాడంత నిరీక్షణ జాబితా ఉంది. కాగా పండుగ ముందు విశాఖ నుంచి సికింద్రాబాద్ వెళ్లే రైళ్లకు ఈనెల 12, 13వ తేదీల్లో మాత్రమే డిమాండ్ ఉండడం గమనించదగ్గ విషయం.

హైదరాబాద్ రైళ్లు 16 నుంచి 22 వరకు ఫుల్

పండుగ తర్వాత విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్, హైదరాబాద్ వెళ్లే గోదావరి (12727), వందేభారత్ (20833), గరీబ్‌రథ్ (12739), దురంతో (22203), జన్మభూమి (12805), విశాఖ-ఎల్‌టీటీ (18519), విశాఖ-కాచీగూడ (18561), విశాఖ-సికింద్రాబాద్ ఏసీ ఎక్స్‌ప్రెస్ (12783), విశాఖ-మహబూబ్‌నగర్ సూపర్‌ఫాస్ట్ (12861), విశాఖ-నాందేడు సూపర్‌ఫాస్ట్ (20811), విశాఖ-కర్నూలు ప్రత్యేక రైలు (08585)తో పాటు భువనేశ్వర్, హౌరా నుంచి విశాఖ మీదుగా సికింద్రాబాద్ వెళ్లే విశాఖ ఎక్స్‌ప్రెస్ (17015), కోణార్క్ (11020), ఫలక్‌నూమా (12703), ఈస్ట్‌కోస్ట్ (18045), అలాగే వారాంతపు రైళ్లైన సంబల్‌పూర్-నాందేడు ఎక్స్‌ప్రెస్ (20809), టాటా-యశ్వంత్‌పూర్ (18111), సిల్చార్-సికింద్రాబాద్ (12514), డిబ్రుగర్-సికింద్రాబాద్ ప్రత్యేక రైలు (07047)లో బెర్తులు నిండిపోయాయి. కాగా వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు (20833) ఈనెల 22 నుంచి, మరికొన్ని రైళ్లకు 23 నుంచి ఏసీ క్లాసు బెర్తులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. స్లీపర్ క్లాసు బెర్తులు నెలాఖరు వరకూ ఖాళీ లేవు.

చెన్నై రైళ్లకు...

పండుగ అనంతరం చెన్నై వెళ్లే రైళ్లకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు అయ్యప్ప భక్తుల తాకిడి తోడవడంతో కోరమండల్ (12841), మెయిల్ (12839), బొకారో (13351) వంటి రెగ్యులర్ రైళ్లతోపాటు విశాఖ-చెన్నై ఎక్స్‌ప్రెస్ (22801), హౌరా-కన్యాకుమారి (12665), భువనేశ్వర్-పాండిచ్చేరి ఎక్స్‌ప్రెస్ (12898), భువనేశ్వర్-చెన్నై సూపర్‌ఫాస్ట్ (12830), టాటా-ఎర్నాకులం (18189), షాలిమార్-చెన్నై ఎక్స్‌ప్రెస్ (22825) లకు జనవరి 26వ తేదీ వరకు బెర్తులు లభించే పరిస్థితి లేదు. చెన్నై వెళ్లే వాటిలో కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌తోపాటు కొన్ని వారాంతపు రైళ్లకు జనవరి 23 నుంచి థర్డ్ ఏసీలో బెర్తులు అందుబాటులో ఉన్నాయి.

ఈనెల 26 వరకు బెంగళూరు రైళ్లు ఫుల్

విశాఖ మీదుగా బెంగళూరు వెళ్లే భువనేశ్వర్-బెంగళూరు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ (18463), హౌరా-బెంగళూరు (12863) వంటి ప్రతిరోజు నడిచే ... మిగతా 6వ పేజీలో

కోడి నేలచూపులు

పడిపోయిన చికెన్ ధర

- స్కిన్‌లెస్ రూ.150
- మార్కెట్‌లో కార్పొరేట్ సంస్థల మధ్య పోటీయే కారణం
- పోటాపోటీగా కోళ్ల పెంపకం
- డిమాండ్‌కు మించి ఉత్పత్తి
- దాంతో రోజురోజుకూ తగ్గుతున్న ధరలు
- నలిగిపోతున్న రైతులు



విశాఖపట్నం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కోడిమాంసం వ్యాపారంలో కార్పొరేట్ సంస్థల మధ్య విపరీతమైన పోటీ నెలకొనడంతో ఉత్పత్తి పెరిగి కొద్దిరోజులుగా ధర తగ్గుతోంది. మార్కెట్‌లో ఆధిపత్యం కోసం పాత కంపెనీలతో కొత్తగా వచ్చిన కంపెనీలు పోటీ పడుతున్నాయి. ఈ నేపథ్యంలో డిమాండ్‌కు ఇబ్బడిముబ్బడిగా కోళ్ల పెంపకం చేపడుతున్నందున చికెన్ ధరలు తగ్గుతూ వస్తున్నాయి. విశాఖపట్నంలో మంగళవారం లైవ్ కిలో రూ.85, స్కిన్‌లెస్ ధర కిలో రూ.150గా బ్యాగ్ సంస్థ నిర్ణయించింది. మిగిలిన కంపెనీలు దాదాపు ఇదే రేటు ప్రకటించాయి. చికెన్ వినియోగం ప్రస్తుతం గతంలో మాదిరిగానే ఉన్నా కంపెనీల మధ్య పోటీతో రేటు పడిపోతోంది. కార్పొరేట్ కంపెనీల మధ్య పోటీతో కోళ్ల ఫారాలు నిర్వహించే రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కోళ్ల వ్యాపారంలో గతంలో మూడు, నాలుగు కార్పొరేట్ కంపెనీలు, పెద్ద సంఖ్యలో రైతులు ఉండేవారు. గడచిన ఏడాదిలో మరో ఐదారు కార్పొరేట్ కంపెనీలు వచ్చాయి. కొత్తగా వచ్చిన కంపెనీలు ఒడిశా, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల్లో కూడా ఫారాలు నెలకొల్పాయి. ఎక్కువ కంపెనీలు సొంతంగా ఫారాలు నిర్వహణతోపాటు కోడి పిల్లలు, మేత, మందులు వచ్చి రైతుల ద్వారా కూడా పెంపకం చేపడుతుంటాయి. అలా పెంచినందుకు రైతుకు కిలోకు రూ.ఐదు నుంచి రూ.ఏడు వరకూ ఇస్తుంటాయి. అయితే మార్కెట్ డిమాండ్‌కు తగినట్టుగా కాకుండా పెద్ద సంఖ్యలో కోళ్ల పెంపకం చేపడుతున్నారు. గతంలో ఉత్తరాంధ్ర నుంచి ప్రతిరోజు లక్షల్లో కోళ్లు ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌కు ఎగుమతి చేసేవారు. ఇప్పుడు అక్కడ కూడా ఫారాలు ఏర్పాటు చేయడంతో ఉత్తరాంధ్రలో పెంచిన కోళ్లు ఇక్కడే వినియోగం కోసం మార్కెట్‌కు తీసుకురావల్సిన పరిస్థితి నెలకొంది. నెలల తరబడి స్టాకు చేసే అవకాశం లేనందున ఐదారు రోజుల తేడాతో రెండు కిలోల బరువు కోడి మార్కెట్‌లో అమ్మకానికి పెట్టాల్సిందే. ఇక రేటు విషయంలో కూడా కంపెనీల మధ్య పోటీ పెరగడంతో రోజురోజుకూ తగ్గిస్తున్నారు. కోడి పిల్ల 39 నుంచి 43 రోజుల్లో రెండు కిలోల బరువు పెరుగుతుంది. ఇందుకు కిలోకు రూ.90 నుంచి 95 ఖర్చవుతుంది. ప్రస్తుతం కిలో కోడి ఫారం రేటు రూ.65గా నిర్ణయించినా రైతు/కంపెనీకి చేతికి వచ్చేది రూ.58లే. దీంతో కిలోకు కంపెనీ/రైతు సుమారు రూ.32 నుంచి రూ.37 వరకు నష్టపోతున్నారు. గత ఏడాది డిసెంబరు ఏడో తేదీన స్కిన్‌లెస్ రూ.140కు పడిపోయింది. తరువాత క్రమేపీ పెరిగినా రైతు/కంపెనీకి గిట్టుబాటు ధర రాలేదు. గత ఏడాది జనవరి తొమ్మిదో తేదీన కిలో స్కిన్‌లెస్ రూ.226 ఉండేది. ప్రస్తుతం ఉత్తరాంధ్ర మార్కెట్‌లో ఆదివారం పది లక్షల కోళ్లు (20 లక్షల కిలోల చికెన్), మిగిలిన ... మిగతా 6వ పేజీలో



జీవీఎంసీ కార్యాలయం ఎదురుగా వున్న గాంధీ విగ్రహం వద్ద సోమవారం రాత్రి చలిమంట చుట్టూ తిరుగుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీలపై ఒత్తిళ్లు

- విధుల నుంచి తొలగిస్తామంటూ ఇటీవల ఉద్యోగంలో చేరిన వారికి అధికారుల హెచ్చరికలు
- మరోవైపు ఎస్మాకు అనుగుణంగా నేటి నుంచి ఉద్యోగులకు నోటీసులు ఇచ్చేందుకు సిద్ధం
- అయినా వెనక్కితగ్గేది లేదంటున్న ఉద్యోగులు

విశాఖపట్నం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ సిబ్బందితో సమ్మె విరమింపజేసేందుకు అధికారులు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. అసోసియేషన్ ప్రతినిధులతో పలు దఫాలు జరిపిన చర్చలు విఫలం కావడంతో ఇప్పుడు బెదిరింపులకు దిగుతున్నారు. ఉద్యోగులను విభజించడం ద్వారా సమ్మెను బలహీనం చేయాలని చూస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ మధ్యకాలంలో విధుల్లో చేరిన ఉద్యోగులకు అధికారులు ఫోన్లు చేస్తున్నారు. కొత్తగా చేరినవారు సమ్మె చేస్తే తొలగించే అధికారం తమకు ఉంటుందని, వెంటనే విధుల్లో చేరాలంటూ హెచ్చరిస్తున్నారు. అలాగే, మరికొందరిని ఎస్మా అస్త్రాన్ని చూపించి భయపెట్టే ప్రయత్నాన్ని చేస్తున్నారు. ఈ మేరకు మంగళవారం నుంచి ఎస్మాకు అనుగుణంగా ఉద్యోగులకు నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా అనేక అంగన్‌వాడీ కేంద్రాలకు నోటీసులు అంటించారు. నోటీసులకు సరైన సమాధానం ఇవ్వకపోతే వారిపై చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు.



పెదగంట్యాడ సెంటర్ అంబేద్కర్ నగర్ కాలనీలో అంటించిన నోటీసులు

వెనక్కితగ్గే ప్రసక్తే లేదు

ప్రభుత్వం ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా డిమాండ్లు నెరవేర్చేంత వరకూ వెనక్కి తగ్గే ప్రసక్తి లేదని అంగన్‌వాడీలు స్పష్టం చేస్తున్నారు. వేతనాలు పెంచడంతోపాటు గ్రాట్యుటీ అమలు చేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందించాలని కోరుతున్నారు. కీలకమైన డిమాండ్లను అమలు చేయకుండా ఇబ్బందులు పెట్టే ప్రయత్నం చేస్తే ... మిగతా 6వ పేజీలో

కనక మహాలక్ష్మికి త్రికాల పంచామృతాభిషేక సేవలు



విశేష అలంకరణలో కనక మహాలక్ష్మి అమ్మవారు

జగదాంబ కూడలి, జనవరి 8: మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా కనక మహాలక్ష్మికి త్రికాల పంచామృతాభిషేక సేవలను ఆలయ అర్చకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం ఆలయంలో జరిగిన పూజల్లో 10 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజల్లో పాల్గొనదలచిన భక్తులు గురువారం రూ.7500, సాధారణ రోజుల్లో రూ.2500లు చెల్లించాలని ఈవో కె.శిరీష తెలిపారు. మార్గశిర ఉత్సవాలను పురస్కరించుకొని అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించు కున్నారు. జగన్నాథ స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం ఆలయం వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ధర్మ ప్రచార ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి రథయాత్ర పెందుర్తి పాపయ్యరాజుపాలేనికి చేరుకుంది.

ఏనుగు పిల్లల కథల పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సత్యనారాయణమూర్తి

సీతమ్మధార, జనవరి 8: ఆధునిక బాల సాహిత్య లక్షణాలతో, మానవీయత అంతర్లీనంగా అల్లుకొని పిల్లల కోసం రాసిన చక్రవర్తి ఏనుగు పిల్లల కథల సంపుటి అందరికీ నచ్చుతుందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి అన్నారు. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యంలో రచయిత ఎస్.హనుమంతరావు రచించిన చక్రవర్తి ఏనుగు సంపుటిని సోమవారం సాయంత్రం స్థానిక పౌరగ్రంథాలయంలో సత్యనారాయణమూర్తి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన తరతరాల సంస్కృతిలో ఉన్న పద్ధతులు, ఆచారాలను నేటి తరం పిల్లలకు అర్థమయ్యే రీతిలో కథలు ఉన్నాయని చెప్పారు. ప్రముఖ కవి గరిమెళ్ళ నాగేశ్వరరావు పుస్తక సమీక్ష చేశారు. వాస్తవిక ఘటనలను ప్రతిబింబించే విధంగా రచయిత రచనలు చేశారన్నారు. అరసం జిల్లా కార్యదర్శి ఉప్పల అప్పలరాజు అధ్యక్షత వహించగా, బేతా రామసూర్యప్రకాశరావు, అడపా రామకృష్ణ, ఎంవీవీ సత్యనారాయణ, డీవీ సూర్యారావు, బండి సత్యనారాయణ, ఎం.పైడిరాజు, సీఎస్ క్షేత్రపాల్, పి.శ్యాంసుందర్ పాల్గొన్నారు.

ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయ హుండీల లెక్కింపు

సీతమ్మధార, జనవరి 8: స్థానిక నక్కవానిపాలెంలోని శ్రీ ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయ హుండీలను సోమవారం లెక్కించారు. నాలుగు నెలల 25 రోజులకుగాను రూ.3,14,369ల ఆదాయం వచ్చింది.

'జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి'

మహారాణిపేట, జనవరి 8: జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని కలెక్టర్ ఎ.మల్లికార్జునను తెలుగు యువత నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పెంటిరాజు, తాతాజీ, శ్రీనివాసరావు, గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

అక్కయ్యపాలెం, జనవరి 8: జీవీఎంసీ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 122 మంది విద్యార్థినీ, విద్యార్థులకు సోమవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. అబుదాబి (యూఏఈ)లో నివాసముంటున్న సిరిపురపు బలరామకృష్ణ, జయలక్ష్మి దంపతులు, వారి కుమార్తె ఐశ్వర్య రూ.25వేల విలువ గల స్టడీ మెటీరియల్‌ను అందజేశారని పాఠశాల ప్రధానోపాధ్యాయిని బి.లక్ష్మీనరస తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్.శ్రీనివాసరావు, ఏజే జ్యోతి, ఆర్.రాధిక, పి.పద్మలత, కె.మాణిక్యం, ఎ.రామలక్ష్మి, పి.లలిత, ఎంవీ ధర్మారావు, ఎ.సునంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్ర, బెంగాల్ మధ్య రంజీ మ్యాచ్ డ్రా

విశాఖపట్నం (స్పోర్ట్సు), జనవరి 8: ఏసీఏ, వీడీసీఏ స్టేడియంలో ఆంధ్ర, బెంగాల్ మధ్య జరిగిన రంజీ మ్యాచ్ డ్రాగా ముగిసింది. చివరి రోజు ఆటలో 339/6 ఓవర్‌నైట్ స్కోరుతో సోమవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర 445 పరుగులకు ఆటౌటై 39 పరుగుల ఆధిక్యత సాధించింది. వ్యక్తిగత అజేయ సెంచరీతో (107 నాటౌట్) బ్యాటింగ్ కొనసాగించిన రిక్కీ బుయ్ 175 పరుగులు చేసి అవుటయ్యాడు. ఇక 31 నాటౌట్ పరుగుల వ్యక్తిగత స్కోరుతో బ్యాటింగ్ చేసిన షోయబ్ మహ్మద్ ఖాన్ అర్థ సెంచరీ (56) సాధించాడు. బెంగాల్ బౌలర్లలో మహ్మద్ కైఫ్ మూడు, ఆకాష్ దీప్ రెండు వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్ బ్యాటింగ్‌కు దిగిన బెంగాల్ చివరి రోజు ఆట ముగిసే సరికి 25 ఓవర్లలో ఒక వికెట్ నష్టపోయి 82 పరుగులు చేయడంతో మ్యాచ్ డ్రా అయింది.

రాష్ట్రాభివృద్ధి కోసం వైసీపీకి రాజీనామా

- ఆంధ్రప్రదేశ్ స్వర్ణకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కర్రి వేణుమాధవ్



సమావేశంలో మాట్లాడుతున్న కర్రి వేణు మాధవ్

మహారాణిపేట, జనవరి 8: ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం వైసీపీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు జాతీయ బీసీ సంఘం అధికార ప్రతినిధి, ఆంధ్రప్రదేశ్ స్వర్ణకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కర్రి వేణుమాధవ్ ప్రకటించారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి కుంటుపడుతున్న నేపథ్యంలో ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ నాయకులతో చర్చించి ఏ పార్టీలో చేరాలనే నిర్ణయం తీసుకుంటానని, ఆ విషయాన్ని త్వరలో ప్రకటిస్తానని చెప్పారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సాధికారక కమిటీ చైర్మన్ గోడి నరసింహాచారి, ఆంధ్ర ప్రదేశ్ స్వర్ణకారుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పక్కి కొండబాబు, స్వర్ణకార నాయకులు ముదపాక రవి, పెదపూడి బ్రహ్మాజీ, ఈర్ని ప్రకాశ్, చిట్టూరి సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అరుస్తాయ్.. కరుస్తాయ్..

- ఉత్తర నియోజకవర్గంలో కుక్కల స్వైర విహారం
- గుంపులుగా తిరుగుతూ పాదచారులపై దాడులు
- భీతిల్లుతున్న జనం



అక్కయ్యపాలెం, జనవరి 8: ఉత్తర నియోజకవర్గంలోని పలు వార్డుల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులుగా తిరుగుతూ పాదచారులు, ద్విచక్ర వాహన చోదకుల వెంట పడి కరిచేస్తున్నాయి. దీంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. కుక్కల నియంత్రణకు జీవీఎంసీ అధి కారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని వాపోతున్నారు.

జీవీఎంసీ 42, 43, 44, 45, 46 వార్డుల్లోని పలు ప్రాంతాల్లో వీధి కుక్కలు అధికంగా ఉన్నాయి. రోడ్లపై గుంపులుగా సంచరిస్తున్నాయి. దీంతో వాటిని తప్పించుకొని నడవాలంటే జనం భయాందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో అయితే పరిస్థితి మరీ దారుణంగా ఉంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంకటరాజు నగర్, టీఎస్ఎన్ కాలనీ, రైల్వేన్యూకాలనీ, శ్రీనివాసనగర్, రామచంద్రానగర్, అబిద్‌నగర్, ఎన్‌జీజీఓస్ కాలనీ, శంకువానిపాలెం, చాకలిపేట, నరసింహనగర్, సాలిగ్రామపురం, లక్ష్మీనారాయణపురం, కస్తూరినగర్, కైలాసపురం, మధుసూదన్‌నగర్ తదితర ప్రాంతాల్లో కుక్కలు విచ్చలవిడిగా సంచరించడంతో చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



42వ వార్డు వెంకటరాజునగర్‌లో గుంపుగా ఉన్న కుక్కలు

జగన్ పాలనపై జనంలో విసుగు

- ప్రచారమే తప్ప నవరత్నాల అమలు శూన్యం
- టీడీపీ విశాఖ దక్షిణ ఇన్‌చార్జి గండి బాబ్జీ



మాట్లాడుతున్న గండి బాబ్జీ

విశాఖపట్నం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనపై అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయి ఉన్నారని టీడీపీ విశాఖ దక్షిణ ఇన్‌చార్జి గండి బాబ్జీ విమర్శించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ నవరత్నాలు అమలు చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్నారు తప్ప క్షేత్రస్థాయిలో అందుకు భిన్నంగా ఉందని ఆరోపించారు. నవరత్నాల్లో 98 శాతం ప్రజలకు చేరాయని చేస్తున్న ప్రచారం అబద్ధమన్నారు. విద్యుత్ బిల్లు 300 యానిట్లు దాటితే రేషన్‌కార్డు కట్‌చేయడంతోపాటు పించన్, ఇతర పథకాలు నిలిపివేస్తున్నారని, దీనిపై బహిరంగ చర్చకు రావాలని అధికార పార్టీ నాయకులకు సవాల్ చేశారు. దేశంలో తొలిసారిగా శాసనసభ్యులను ఎన్నికైన నియోజకవర్గం నుంచి మరో నియోజకవర్గానికి బదిలీ చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన రెడ్డిని వచ్చే ఎన్నికల్లో ప్రజలు రాష్ట్రం నుంచి బదిలీ చేయడం ఖాయమన్నారు. తెలుగుదేశం పార్టీ రాజమండ్రిలో విడుదల చేసిన మినీ మేనిఫెస్టోలో ఆరు అంశాలలో మూడింటిని ఇప్పుడే అమలుచేస్తామని వైసీపీ ప్రభుత్వం చెబుతుందని వ్యాఖ్యానించారు. అంటే తెలుగుదేశం ప్రకటించింది కాబట్టి ఇప్పుడు అమలుచేస్తారా? అని ప్రశ్నించారు. మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం కల్పించాలని ప్రభుత్వం ఆలోచిస్తోందని, ఒకవేళ దీనిని అమలుచేస్తే తెలుగుదేశం ఉచిత బస్సు ప్రయాణమని చెప్పుకోవాల్సి ఉంటుందన్నారు. విశాఖ పరిసరాల్లో టీడీపీ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లకు వైసీపీ రంగులు వేశారు తప్ప అక్కడ మౌలిక వసతుల సంగతి మర్చిపోయారని బాబ్జీ దుయ్యబట్టారు.

జీవీఎంసీ కాంట్రాక్టు కార్మికులకు టీడీపీ సంఘీభావం

డాబాగార్డెన్స్, జనవరి 8: జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం సరస్వతి పార్కు వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో టీడీపీ విశాఖ పార్లమెంట్ ఇన్‌చార్జి శ్రీ భరత్, దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ పాల్గొని వారికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగుల పర్మినెంట్, పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మెకు తాము పూర్తిగా మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. కార్మికులకు టీడీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.



కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న శ్రీ భరత్, పక్కన గండి బాబ్జీ

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాలు



కళాశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్న దృశ్యం

డాబాగార్డెన్స్, జనవరి 8: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సంక్రాంతి పండగ ముందే వచ్చింది. సంప్రదాయ వస్త్రధారణతో విద్యార్థినులు సోమవారం సందడి చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న సమాజంలో పాశ్చాత్య నాగరికత ప్రాధాన్యం పెరుగుతున్నప్పటికీ సనాతన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను, మన పండగలను మరువరాదని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి ఎన్‌వీ పద్మకుమారి, వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, అరుణపద్మ, బి.రాధమ్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏపీయూఎస్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

అక్కయ్యపాలెం, జనవరి 8 : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయం సంఘం (ఏపీయూఎస్) రూపొందించిన నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్లను కలెక్టర్ ఎ.మల్లికార్జున సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర బాధ్యులు ఎంపీ శ్రీనివాస్, చిరంజీవి, జిల్లా ప్రధానాధ్యక్షుడు అవనా అరుణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి త్రినాథమూర్తి, జిల్లా మహిళా కార్యదర్శి ఎ.రామలక్ష్మి, జిల్లా కోశాధికారి, నగర కార్యదర్శి ఎంఎస్‌వీ విశ్వనాథం పాల్గొన్నారు.

జోన్-5లో స్పందనకు ఐదు అర్జీలు

జ్ఞానాపురం, జనవరి 8: జీవీఎంసీ జోన్-5 పరిధిలో వచ్చే జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో వచ్చే అర్జీలపై అధికారులు అలసత్వం వహించవద్దని, వెంటనే పరిష్కరించడానికి కృషి చేయాలని అధికారులను జడ్సీ ఆర్‌జీవీ కృష్ణ ఆదేశించారు. జ్ఞానాపురం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్న కు చెబుదాం (స్పందన) కార్యక్రమానికి ఐదు అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో సునీల్‌కుమార్, ఈఈ ప్రసన్నరెడ్డి, ఈఈ ఎం.రాజు, ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, సూపరింటెండెంట్ టీఎస్ఎన్ రాజు, ఏపీడీ పద్మావతి, చిరంజీవి, తదితరుల పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

అల్లిపురం, జనవరి 8: సముద్రంలో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తూ మృతి చెందిన విశాఖపట్నం హార్బర్ వర్కర్స్ యూనియన్ సభ్యుడు మారుపల్లి అప్పన్న కుటుంబానికి ఏఐటీయూసీ తరఫున యూనియన్ గౌరవాధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి రూ.2.1 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వంకా గురుమూర్తి, అధ్యక్షుడు కోడా వజ్రం, కార్యదర్శి పాత్రిపల్లి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అరగుండుతో మునిసిపల్ కార్మికుల నిరసన



సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యవైఖరికి నిరసనగా విశాఖలో అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు మునిసిపల్ కార్మికులు సోమవారం అరగుండు చేయించుకున్నారు. సోమవారం కార్మికులు జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు.
- విశాఖపట్నం/ ఆంధ్రజ్యోతి

నూతన పించన్ల పంపిణీ



నూతన పించన్ల నమూనా చెక్కు అందజేస్తున్న కేకే రాజు

అక్కయ్యపాలెం, జనవరి 8 : జీవీఎంసీ 44వ వార్డు ముస్లిం తాటిచెట్లపాలెంలోని షాదీఖానాలో ఉత్తర నియోజకవర్గం పరిధిలోని అన్ని వార్డులకు సంబంధించి 384 మందికి నూతనంగా మంజూరైన పించన్లను వైసీపీ ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు సోమవారం పంపిణీ చేశారు. అనంతరం కొత్తగా ఎంపికైన వలంటీర్లకు నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్‌లీడర్ బానాల శ్రీనివాసరావు, జోనల్ కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, ఏపీడీ పద్మావతి, కార్పొరేటర్లు పెద్దిశెట్టి ఉషశ్రీ, ఆళ్ల లీలావతి శ్రీనివాస్, కంటిపాము కామేశ్వరి, రెయ్యి వెంకటరమణ, 45వ వార్డు అధ్యక్షుడు పైడి రమణ తదతరులు పాల్గొన్నారు.

బీసీల రక్షణకు టీడీపీ కృషి

మహారాణిపేట, జనవరి 8: బీసీల ఆత్మ గౌరవాన్ని కాపాడడానికి, వారి రక్షణకు టీడీపీ కృషి చేస్తుందని ఆ పార్టీ విశాఖ పార్లమెంట్ ఇన్‌చార్జి ఎం.శ్రీ భరత్ అన్నారు. సోమవారం జయహో బీసీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం 25 వేల మంది బీసీలపై అక్రమ కేసులు బనాయించి వారిని అన్ని విధాలుగా ఇబ్బందులకు గురిచేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వనితా వాకర్స్ క్లబ్‌లో ముగ్గుల పోటీలు

మాధవధార, జనవరి 8: సంక్రాతి సంబరాల్లో భాగంగా జీవీఎంసీ 50వ వార్డు మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. వైశాఖీ స్పోర్ట్సు పార్కు వాకింగ్ ట్రాక్‌లో నిర్వహించిన పోటీల్లో అతివలు రంగవల్లులను అందంగా తీర్చిదిద్దారు. పండగ ముందు రోజు విజేతలకు బహుమతులను అందిస్తామని వనితా వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ పి.ప్రభావతి తెలిపారు. కార్యక్రమంలో వైశాఖీ స్పోర్ట్సు పార్కు కమిటీ అధ్యక్షుడు సనపల వరప్రసాద్ పాల్గొన్నారు.

మాధవధారలో వికసిత భారత్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న విష్ణుకుమార్ రాజు

మురళీనగర్, జనవరి 8: జీవీఎంసీ 51వ వార్డు మాధవధారలో సోమవారం వికసిత భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. జీవీఎంసీ కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు ప్రారంభించారు. జీవీఎంసీ జోన్-5 ఏపీడీ పద్మావతి, నియోజకవర్గ కన్వీనర్ సురేశ్‌బాబు తదితరుల పర్యవేక్షణలో కల్యాణ మండపం వద్ద వైద్య పరీక్షలు నిర్వహించారు.

ఎన్నికల నిర్వహణకు నోడల్ అధికారులు

... 5వ పేజీ తరువాయి

ఎస్‌వీఈఈపీకి సాంఘిక సంక్షేమ శాఖ జేడీ కంచరాన రామారావును, పరిశీలకుల లైజనింగ్ కోసం జిల్లా సర్వే ఏడీ కె.సూర్యారావును నోడల్ అధికారులుగా నియమిస్తూ కలెక్టర్ ఎ.మల్లికార్జున ఉత్తర్వులు జారీచేశారు. కాగా జిల్లాలో పనిచేస్తున్న తహసీల్దార్ల బదిలీలకు సంబంధించి కూడా కసరత్తు చేస్తున్నారు. ఇద్దరు, ముగ్గురు తప్ప మిగిలిన తహసీల్దార్లకు నెలాఖరులోగా బదిలీ అవుతుందని చెబుతున్నారు. ఇప్పటికే తహసీల్దార్ల జాబితాను ప్రభుత్వానికి పంపించారు.

ఫ్లైఓవర్‌లపై పైపై మాటలేనా!?

... 5వ పేజీ తరువాయి

విమానాశ్రయం ముందు వచ్చే ఎన్ఏడీ జంక్షన్‌లో ట్రాఫిక్ సమస్య చాలా తీవ్రంగా ఉందని గుర్తించిన నాటి సీఎం చంద్రబాబునాయుడు రూ.150 కోట్లతో ఫ్లైఓవర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రత్యేకంగా డిజైన్లు తయారు చేయించి చకచకా పనుల పూర్తికి యత్నించారు. ఇంకో ఆరు నెలల్లో ప్రాజెక్టు పూర్తవుతుందనగా, ప్రభుత్వం మారిపోయి వైసీపీ అధికారంలోకి వచ్చింది. దానికి సీఎం జగన్ చేతులు మీదుగా శంకుస్థాపన చేసి తామే నిర్మించినట్టు ఆ పార్టీ ప్రచారం చేసుకుంటోంది. ఈ ప్రాజెక్టులో భాగంగానే ఎన్ఏడీ జంక్షన్‌కి, విమానాశ్రయానికి మధ్య రైల్వేతో కలిసి అండర్ పాస్‌వే నిర్మించాల్సి ఉంది. ఈ ప్రభుత్వం వచ్చి నాలుగున్నరేళ్లు గడిచినా ఆ పనిలో 50 శాతం కూడా పూర్తి కాలేదు. అందులో కేవలం 25 శాతమే పూర్తయిందని వీఎంఆర్‌డీఏ కమిషనర్ హోదాలో కలెక్టర్ మల్లికార్జున ఇటీవలె వెల్లడించారు. వచ్చే సెప్టెంబరు నాటికి కాని పూర్తిచేయలేమని చెప్పేశారు. అంత పెద్ద ఫ్లైఓవర్‌ని టీడీపీ హయాంలో రెండేళ్లలో 80 శాతం పూర్తి చేస్తే, కేవలం అండర్ పాస్‌వే నిర్మాణాన్ని వైసీపీ పూర్తి చేయలేకపోవడం గమనార్హం.

12 చోట్ల ఫ్లైఓవర్ల ప్రతిపాదన

విశాఖపట్నంలో ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారం అంతా ఎండాడ, మధురవాడ, కొమ్మాది, ఆనందపురాల్లో నడుస్తోంది. అధికార పార్టీ నాయకులకు అటు వైపు వేల కోట్ల రూపాయల ప్రాజెక్టులు ఉన్నాయి. అయితే ట్రాఫిక్ కారణంగా అంత దూరం వెళ్లడానికి నగర ప్రజలు ఇష్టపడడం లేదు. హనుమంతవాక, ఎండాడ, కారుషెడ్ జంక్షన్లు బాగా ఇబ్బందికరంగా మారిపోయాయి. ఈ నేపథ్యంలో ఫ్లైఓవర్ల నిర్మాణం చేపడితే తప్ప ప్రజలు అటు వెళ్లరని గుర్తించి ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో పలువురు ఢిల్లీ వెళ్లి కేంద్ర పెద్దలను కలిశారు. అనకాపల్లి నుంచి విశాఖపట్నం మీదుగా ఆనందపురం వెళ్లే జాతీయ రహదారిలో 12 చోట్ల ఫ్లైఓవర్లు నిర్మించాలని కోరారు.

కూర్మన్నపాలెం, గాజువాక, షీలానగర్, మురళీనగర్, తాటిచెట్లపాలెం, సత్యం జంక్షన్, మద్దిలపాలెం, ఇసుకతోట, హనుమంతవాక జంక్షన్, ఎండాడ, కారుషెడ్ జంక్షన్, కొమ్మాది ప్రాంతాల్లో ఫ్లైఓవర్లకు ప్రతిపాదించారు. ఇదంతా 2020లో జరిగింది. అనేక సంప్రతింపుల తరువాత 2022లో ఎన్‌హెచ్‌ఏఐ అనకాపల్లి నుంచి విశాఖపట్నం మధ్య 58 కి.మీ. మార్గంలో ఫ్లైఓవర్ల నిర్మాణంపై సమగ్ర ప్రాజెక్టు నివేదికలు తయారు చేయడానికి బిడ్లను ఆహ్వానించింది. అవి ఏమయ్యాయో తెలియదు. ఏ ఫ్లైఓవర్‌కు ఎంత వ్యయం అవుతుందో అంచనాలు లేవు. కానీ వైసీపీ నాయకులు మాత్రం అవిగో ఫ్లైఓవర్లు...ఇవిగో ఫ్లైఓవర్లు అంటూ ఊదరగొడుతున్నారు. దీనిపై ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు నోరు విప్పి మాట్లాడడం లేదు. కేంద్రం ఈ ప్రాజెక్టు చేపడతానన్న మాట వాస్తవం. కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ దీనిపై పార్లమెంటులో కూడా మాట్లాడారు. రైల్వే జోన్ ఎలాగైతే ఇస్తామని చెప్పి సాగదీసుకువస్తున్నారో...ఇది కూడా అంతే. డీపీఆర్‌లు లేవు. అంచనా వ్యయాలు లేవు. కానీ శంకుస్థాపనలు మాత్రం చేసేస్తామని వైసీపీ నాయకులు ప్రకటనలు చేస్తున్నారు. ఎన్ఏడీలో ఫ్లైఓవర్ నిర్మించి ఇస్తే దానికి అండర్ పాస్‌వే ఏర్పాటుచేయలేకపోయిన పాలకులు ఏకంగా 12 ఫ్లైఓవర్లు నిర్మించేస్తామని చెబుతుంటే...విశాఖ ప్రజలు విస్తుపోతున్నారు.

పెందుర్తి నుంచి అమర్‌కు చాన్స్?

... 5వ పేజీ తరువాయి

అధిష్ఠానాన్ని కోరారంటున్నారు. గతంలో తన తాత అప్పన్న, తండ్రి గురునాథరావు కూడా పెందుర్తి నుంచే పోటీ చేసి గెలిచినందున తనకు అక్కడ నుంచి పోటీకి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేసినట్టు సమాచారం. అక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌పై వ్యతిరేకత ఉందంటూ అతడిని మార్చే ప్రతిపాదన అధిష్ఠానం వద్ద ఉండడం...అమర్‌నాథ్‌కు కలిసొచ్చినట్టయిందని పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు. ఇదిలావుండగా గుడివాడ అమర్‌నాథ్‌కు పెందుర్తి టికెట్ కేటాయించనున్నారనే ప్రచారం సిట్టింగ్ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ శిబిరంలో కలవరం రేపుతోంది. మరి...అదీప్‌రాజ్‌ను ఎక్కడ నుంచి పోటీకి దింపుతారని ఆయన అనుచరులు ప్రశ్నిస్తున్నారు. ఆయన్ను కాకుండా వేరెవరినో తమపై రుద్దితే వారి విజయానికి తాము పనిచేసేది లేదని అంటున్నట్టు సమాచారం.

కోడి నేలచూపులు

... 5వ పేజీ తరువాయి

రోజుల్లో సగటున మూడు నుంచి ఐదు లక్షల కోళ్ల అమ్మకాలు సాగుతున్నాయి. అయితే ఉత్తరాంధ్రలో కొత్తగా కంపెనీలు రావడంతో ఉత్పత్తి ఎంత అనేది కచ్చితంగా చెప్పలేకపోతున్నామని బ్యాగ్ అధ్యక్షుడు కొట్యాడ శ్రీనివాసరావు తెలిపారు. వినియోగం కంటే ఉత్పత్తి ఎక్కువగా ఉంటుందని మాత్రం చెప్పగలమని పేర్కొన్నారు. ఒడిశా మార్కెట్ నుంచి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలతోపాటు ఒక్కొక్కసారి నగరానికి కోళ్లు వస్తున్నాయన్నారు. సంక్రాంతికి రేటు పెరిగే అవకాశం ఉందని, అయితే లాభాలు వచ్చేంత ధరలు రాకపోవచ్చునని అంచనా వేస్తున్నారు. కాగా కంపెనీల మధ్య పోటీతో రైతులు కుదేలైపోయారని బ్యాగ్ మాజీ అధ్యక్షుడు తాత్రాజు అప్పారావు ఆవేదన వ్యక్తంచేశారు. దేశంలో అన్ని ప్రాంతాల్లో కంపెనీల జోరుకు రైతులు నిలబడలేక తిరిగి కంపెనీలు ఇచ్చే పిల్లలు పెంచుకుంటున్నారని, దీనివల్ల కూడా పెద్దగా ఆదాయం రావడం లేదన్నారు. అన్నిరకాల నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని, కోడి మాంసం ధర మాత్రమే తగ్గుతుందన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని కోళ్ల పరిశ్రమను ఆదుకోవాలని కోరారు.

అంగన్‌వాడీలపై ఒత్తిళ్లు

... 5వ పేజీ తరువాయి

ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని సంఘ జిల్లా ప్రెసిడెంట్ తులసి స్పష్టంచేశారు. ఇప్పటివరకూ శాంతియుతంగా సమ్మె చేస్తున్న తాము ఇకపై రోడ్లపైకి రావాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఎస్మా పేరుతో బెదిరించడం సరికాదని హెల్పర్‌గా పనిచేస్తున్న కె.అచ్చియ్యమ్మ ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం ఇచ్చే జీతం కనీసం ఇంటి అద్దెకు కూడా సరిపోవడం లేదన్నారు. వేతనం రూ.26 వేలు చేయాలని, అప్పటివరకూ సమ్మెలోనే ఉంటామని అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్న పి.కృపారాణి స్పష్టంచేశారు. నిరంకుశ చర్యలతో ప్రభుత్వానికి చేటు అని, ఎన్నికల్లో తగిన మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తుందని పలువురు ఉద్యోగులు ఆగ్రహాన్ని వ్యక్తంచేశారు.

రైళ్లు ఫుల్

... 5వ పేజీ తరువాయి

ఎక్స్‌ప్రెస్‌లతోపాటు విశాఖ-బెంగళూరు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ (08543), భువనేశ్వర్-బెంగళూరు హంసఫర్ (22833), హౌరా-బెంగళూరు హంసఫర్ (22887), హౌరా-బెంగళూరు దురంతో (12245), హటియా-బెంగళూరు (12835), గుహవటి-బెంగుళూరు (12510), భగల్‌పూర్-బెంగుళూరు అంగా ఎక్స్‌ప్రెస్ (12254), అగర్తాల-బెంగళూరు హంసఫర్ (12504), కామాఖ్యా-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12552), పూరి-యశ్వంత్‌పూర్ గరీబ్‌రథ్ (22833), టాటా-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (18111), జసిడిన్ జంక్షన్-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (22306), టాటా-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12889), హౌరా-మైసూర్ ఎక్స్‌ప్రెస్ (22817), భువనేశ్వర్-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12845), హటియా-బెంగుళూరు ఎక్స్‌ప్రెస్ (18637), న్యూ టిన్సుకియా-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (22502), హౌరా-బెంగళూరు ఏసీ ఎక్స్‌ప్రెస్ (22863), ముజాఫర్‌పూర్-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (15228) రైళ్లలో బెర్తులు జనవరి 30 వరకూ రిజర్వు అయిపోయాయి. అయితే రెండు, మూడు వారాంతపు రైళ్లకు జనవరి 26 నుంచి కొన్ని బెర్తులు అందుబాటులో ఉండగా విశాఖ-బెంగళూరు ప్రత్యేక రైలుకు 28న థర్డ్ ఏసీ బెర్తులు ఉన్నాయి. ఇక భువనేశ్వర్ చుట్టుపక్కల ప్రాంతాలకు వెళ్లే రైళ్లకు పండగ అనంతరం డిమాండ్ ఎక్కువగా ఉంది.

'జనబాగీదారీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి'

మహారాణిపేట, జనవరి 8: అమరావతిలోని స్వరాజ్ మైదానంలో జనవరి 19 వ తేదీన 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్న నేపథ్యంలో జనబాగీదారీ పేరిట ఈ నెల 9 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న జిల్లా స్థాయి చైతన్య కార్యక్రమాలలో అందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్ కోరారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం 7 గంటలకు స్థానిక ఎల్ఐసీ బిల్డింగ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం నుంచి రామాటాకీస్ వద్ద అంబేడ్కర్ భవన్ వరకు మారథాన్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అలాగే ఉదయం 9 గంటలకు అంబేడ్కర్ భవన్‌లో రక్తదాన శిబిరం, అంబేడ్కర్ జీవిత చరిత్రపై తీసిన షార్టు ఫిల్మ్, జిల్లా స్థాయి ఫొటో ఎగ్జిబిషన్ ఉంటాయని తెలిపారు. 18వ తేదీ ఉదయం 9 గంటలకు అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రజాప్రతినిధులతో మానవహారం, ప్రతిజ్ఞ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో నర్సింగరావుకు పతకాలు

డాబాగార్డెన్స్, జనవరి 8: ఏపీ స్టేట్ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో నగరానికి చెందిన ఎ.నర్సింగరావు పలు పతకాలు సాధించారు. విశాఖపట్నం రైల్వే గ్రౌండ్స్‌లో ఈ నెల 6, 7 తేదీల్లో నిర్వహించిన లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానం, జావెలిన్ త్రోలో ప్రథమ స్థానం, ట్రిపుల్ జంప్‌లో ద్వితీయ స్థానం సాధించారు.



కొత్తపాలెం ఎంఈఎస్ పంపు హౌస్ వద్ద ప్రమాదకరమైన మలుపు



కాపుజగ్గరాజుపేట రోడ్డులోని మలుపు

ఆ మలుపుల్లో తస్మాత్ జాగ్రత్త!

ప్రమాదాలకు నిలయంగా మారాయని వాపోతున్న వాహనదారులు

సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని వేడుకోలు

కూర్మన్నపాలెం, జనవరి 8: పలు ప్రాంతాల్లోని ప్రమాదకర మలుపులు ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. ఆయా మలుపుల్లో వాహనాలపై రాకపోకలు సాగించేటప్పుడు ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ 88వ వార్డు పరిధిలోని కాపుజగ్గరాజుపేట, ఎస్‌టీబీఎల్ కాలనీ, పకీరుతక్యా, డాక్‌యార్డు కాలనీకి వెళ్లే రహదారుల్లోని మలుపులు యమపురికి కేరాఫ్ అడ్రస్‌గా మారాయని పలువురు వాహనదారులు పేర్కొంటున్నారు. ఆయా మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొంటున్నారు. ప్రమాదకరంగా మారిన



డాక్‌యార్డు కాలనీ రోడ్డులో డేంజరస్ టర్నింగ్..

ఆయా మలుపుల గురించి అధికారులు కనీసం స్పందించడం లేదని ఆయా ప్రాంతాల ప్రజలు, వాహనదారులు వాపోతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు సమీపానికి వచ్చేంతవరకు కనిపించక పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇప్పటికే పలు ప్రమాదాల్లో కొందరు మృతి చెందగా, ఇంకొంత మంది క్షతగాత్రులుగా మారారని పేర్కొంటున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు కనీసం ఆయా మలుపుల వద్ద ప్రమాదాన్ని సూచించేలా బోర్డులు ఏర్పాటు చేయక పోవడం దారుణమని వాహనదారులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలు వాటిల్లకుండా ఆయా మలుపుల వద్ద సూచిక బోర్డులను, స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

గోపాలపట్నం: ఇక్కడి కొత్తపాలెం గ్రామం నుంచి నరవ వెళ్లే ప్రధాన రోడ్డులో ఎంఈఎస్ పంపు హౌస్ వద్దనున్న ప్రమాదకరమైన మలుపు వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో వాహన చోదకులు బీతిల్లుతున్నారు. నిత్యం వందల సంఖ్యలో వాహనదారులు ఈ మార్గం గుండా రాకపోకలు సాగిస్తుంటారు. ఈ మలుపు వద్ద జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని స్థానికంగా ఉన్న ఓ స్వచ్ఛంద సంస్థ భారీ అద్దాన్ని ఇక్కడ ఏర్పాటు చేసింది. అయితే కొందరు ఆకతాయిలు అద్దాన్ని పగలగొట్టడంతో ప్రమాదాలు పరిపాటిగా మారాయి. అందువల్ల అధికారులు స్పందించి ప్రమాద కరమైన ఈ మలుపు సమీపంలో స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయవలసిందిగా పలువురు వాహనదారులు కోరుతున్నారు.



కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న పెంటమ్మ, కుటుంబ సభ్యులు

ఉక్కు ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 8: అక్రమంగా ఆర్-కార్డును మార్చుకుని స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగం చేస్తున్న అధికారిపై తగిన చర్యలు చేపట్టాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'స్పందన'లో కలెక్టర్‌కు ఉక్కు నిర్వాసితురాలు యేర్లేటి పెంటమ్మ కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఉక్కు నిర్వాసితురాలైన పెంటమ్మకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారని, ఇటీవల కాలంలో ఉక్కు నిర్వాసిత కార్డు (ఆర్-కార్డు)ను మనవడుకు బదిలీ చేసుకుందామని ఉక్కు భూసేకరణ కార్యాలయాన్ని సంప్రదిస్తే ఆర్-కార్డు ఎప్పుడో మారిపోయినట్టు వారు తెలిపినట్టు పేర్కొన్నారు. అగనంపూడికి చెందిన ఓ వ్యక్తి ఆ కార్డు ద్వారా స్టీల్‌ప్లాంట్‌లో అధికారి స్థాయిలో ఉద్యోగం చేస్తున్నాడని, ఆ వ్యక్తికి తమకు ఎలాంటి సంబంధం లేనందున తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. అక్రమ పద్ధతితో ఆర్-కార్డు మార్చుకోవడం వల్ల నిజమైన ఉక్కు నిర్వాసితులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

భగవద్గీత ఉపాసకురాలు గీతా సత్యవతికి సత్కారం

పెందుర్తి-రూరల్, జనవరి 8: భగవద్గీత ఉపాసకురాలు బి.గీతా సత్యవతిని సోమవారం సాయంత్రం చింతలఅగ్రహారంలోని రామాలయ ప్రాంగణంలో గ్రామస్థులు, పెద్దలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎంపీపీ కాళ్ల వరలక్ష్మి మాట్లాడుతూ పరిసర గ్రామాల్లోని ప్రజలకు గీతా పఠనంపై అవగాహన కల్పించేందుకు గీతా సత్యవతి ఎంతో చేస్తుండడం ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాడి గోపి అప్పలనాయుడు, మాజీ సర్పంచ్‌లు ఆళ్ల తాతారావు, పి.వెంకటరమణ, పి.అప్పారావు, గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు మద్దాల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **డెవిల్ :** జగదాంబ, వెంకటేశ్వర, కామేశ్వరి, శ్రీకన్య, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), దుర్గ (మధురవాడ), తాతా (తగరపువలస)
● **బబుల్ గమ్ :** శరత్, రమాదేవి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
● **సలార్ :** మెలోడి, సంగం, శారద, శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లిఖిత(శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
● **పిండం :** మోహిని (గాజువాక)
● **ఆక్వామెన్ :** సుకన్య(గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
● **హాయ్ నాన్న :** మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), గణేష్ (తగరపువలస),

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 25, టమాటా 20, వంకాయలు (తెలుపు) 30, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 60, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 52, బీరకాయలు 56, ఆనపకాయలు 20, కాలీఫ్లవర్ 20, క్యాబేజ్ 18, క్యారేట్ 38, దొండకాయలు 30, బంగాళా దుంపలు 19, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 76, అల్లం (పాతది) 110, బరబటి 52, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 44, దోస కాయలు 34, వెల్లుల్లి (పెద్దవి) 230, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 40, ఆగాకర 84, పొటల్స్ 54, కీరదోస 24, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 15, చేమదుంపలు 56, చిలగడదుంపలు 30, కంద 56, దేముడు చిక్కుడు 35, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 26, మామిడి అల్లం 60, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	625
విజయనగరం	629
శ్రీకాకుళం	629

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	65
ఫారం ధర	--	85
విత్ స్కిన్	--	140
స్కిన్‌లెస్	--	150

టీడీపీ విజయం తథ్యం: ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం, జనవరి 8: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం తథ్యమని, తమ అధినేత చంద్రబాబునాయుడు మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని 'పశ్చిమ' ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) పేర్కొన్నారు. స్థానిక వైష్ణవి ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఉదయం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేలను జగన్ నమ్మడం లేదని,



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గణబాబు

అయితే జగన్‌ను జనాలు నమ్మడం లేదని ఎద్దేవా చేశారు. జగన్ ఇచ్చిన హామీలన్నింటినీ గాలికొదిలేశారని విమర్శించారు. ఏటా జనవరి ఒకటిన జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని చెప్పి నిరుద్యోగ యువతను మోసం చేశారని, మద్యనిషేధమంటూ జగన్ తమ సొంత బ్రాండ్‌లను మార్కెట్‌లో ప్రవేశపెట్టి మందుబాబుల జీవితాలతో ఆటలాడుకుంటున్నారన్నారు. రూ.మూడు వేల పెన్షన్ అని చెప్పి తన పదవీ కాలం ముగిస్తుందన్న తరుణంలో దానిని అమలు చేయడం దారుణమన్నారు. ప్రజలపై చెత్త పన్ను భారాన్ని వేయడం. నిత్యావసర సరకుల ధరలు పెంచుతూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే పశ్చిమ నియోజకవర్గం ఎంతో అభివృద్ధి సాధించందని గణబాబు పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో కార్పొరేటర్ గల్లా చిన్న, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు, నాయకులు దినకర్, శీరం ఉమామహేశ్వరి, కోరాడ శ్రీనివాసరావు, మాతా శ్రీను, మజ్జి సోమేశ్, తదితరులు పాల్గొన్నారు.

హిట్లర్‌ను తలపిస్తున్న సీఎం జగన్

అంగన్‌వాడీల నిరసన దీక్షా శిబిరంలో నాయకులు

పెందుర్తి, జనవరి 8: న్యాయ సమ్మతమైన డిమాండ్ల సాధన కోసం సమ్మెబాట పట్టిన అంగన్‌వాడీలపై ఎస్మా అస్త్రాన్ని ప్రయోగించడం ద్వారా సీఎం జగన్ హిట్లర్‌ను తలపిస్తున్నారని పలువురు నాయకులు మండిపడ్డారు. తమ సమస్యలను పరిష్కరించాలంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె చేస్తున్న సంగతి తెలిసిందే. దీక్షా శిబిరం సమీపంలోని మండల పరిషత్ ఆవరణలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరవధిక



దీక్షా శిబిరంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు

నిరాహార దీక్షలో సోమవారం ఆరుగురు కూర్చున్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పెందుర్తి, గాజువాక, పెదగంట్యాడ మండలాలకు చెందిన అంగన్‌వాడీలు పెద్దసంఖ్యలో తరలివచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీక్షా శిబిరం వద్దే పలువురు అంగన్‌వాడీలు నిద్రించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.దేవి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.అనిత, జిల్లా అధ్యక్షురాలు బృంద, తదితరులు పాల్గొన్నారు.



మింది హైస్కూల్లో సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న డీఈవో చంద్రకళ, తదితరులు



హరిదాసు, సంప్రదాయ దుస్తుల్లో శ్రీనగర్‌లోని శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు

పాఠశాలల్లో ఘనంగా సంక్రాంతి సంబరాలు

అక్కిరెడ్డిపాలెం, జనవరి 8: సంక్రాంతి సంబరాలను సోమవారం పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మింది హైస్కూల్‌లో చేపట్టిన సంక్రాంతి సంబరాలు అంతరించిపోతున్న తెలుగు సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టాయి. హెచ్ఎం పీవీఎస్ ఆంజనేయ ఆధ్వర్యంలో స్కూల్ సిబ్బంది హైస్కూల్ మైదానంలో ఏర్పాటుచేసిన పల్లె వాతావరణం సెట్, పూర్ణకుంభం, చెరకు గడలు, నవధాన్యాలు, ప్రత్యేక పిండివంటల మధ్య విద్యార్థినులు రంగురంగుల ముగ్గులు వేసి సంక్రాంతి శోభను ఇనుమడింపజేశారు. డీఈవో చంద్రకళ ఈ సంబరాలను ప్రారంభించగా, విద్యార్థులు డూడూ బసవన్నల్లా, హరిదాసుల్లా తయారై ఆలపించిన కీర్తనలు, విద్యార్థినులు ఆలపించిన గొబ్బెమ్మ గీతాలు చూపరులను అమితంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థుల కోలాటం, తప్పెటగుళ్లు, తదితర సాంస్కృతిక ప్రదర్శనలు మంత్రముగ్ధుల్ని చేశాయి. ఈ కార్యక్రమంలో ఎంఈవో సునీత, వైసీపీ నగర ప్రధాన కార్యదర్శి గుడివాడ లతీశ్, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీనగర్: విద్యార్థులకు మన సంప్రదాయాలను అందించాలనే ధ్యేయంతో సంక్రాంతి సంబరాలను నిర్వహించామని శ్రీచైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ అరుణ కుమారి అన్నారు. 71వ వార్డు శ్రీనగర్‌లోని శ్రీచైతన్య స్కూల్‌లో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగాయి. భోగి మంటలు, హరిదాసుల కీర్తనలు, రంగవల్లులు, సంప్రదాయ వస్త్ర ధారణతో చిన్నారులు ఆకట్టుకున్నారు.

సింధియా: పశ్చిమ నియోజకవర్గంలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో సంక్రాంతి వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. సంక్రాంతి శోభ ఉట్టిపడేలా భోగి మంటలు వేసి హరిదాసుల కీర్తనలు, సంప్రదాయ వంటల నడుమ వేడుకలు జరిపారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు ఉత్సాహంగా నృత్యాలు వేశారు.

గోపాలపట్నం: స్థానిక లక్ష్మీనగర్ ఎంపీపీ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఎంఈవోలు సోమేశ్వరరావు, దివాకర్‌లు మాట్లాడుతూ సనాతన ఆచార సంప్రదాయాలను ప్రతిఒక్కరూ గౌరవించడంతో పాటు భావితరాలకు అందించేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, రంగుల ముగ్గులు ఆకట్టుకున్నాయి. హెచ్ఎం వరలక్ష్మి, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శాంతి రథంలో కేజీహెచ్‌కు మృతదేహం తరలింపు

ఆటోనగర్, జనవరి 8: ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఖరగ్‌పూర్‌కు చెందిన ప్రజాపతి రాంజీ (48) బతుకు తెరువు కోసం ఆటోనగర్ వచ్చి చిన్న చిన్న ప్రైవేటు పనులు చేసుకుంటూ రెండేళ్లుగా ఇక్కడే ఉంటున్నారు. అయితే ఆదివారం వేకువజామున అనారోగ్యంతో ఆయన మృతి చెందాడు. ఆయనకు ఎవరూ లేకపోవటంతో మృతదేహాన్ని గాజువాక ఎస్ఐ రవికుమార్ సూచన మేరకు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ దీనంకొండ కృష్ణంరాజు శాంతి రథంలో కేజీహెచ్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు బలివాడ సత్యారావు, బాసంగి తిరుపతిరావు, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

డాక్‌యార్డు ఉద్యోగుల రిలే నిరహర దీక్షలు

మల్కాపురం, జనవరి 8: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వర్గానికి తీరని అన్యాయం చేస్తుందంటూ డాక్‌యార్డు విజయనగరం గేటు వద్ద పన్నెండు గంటల రిలే నిరాహార దీక్షలను నేవల్ సివిల్ ఎంప్లాయీస్ యూనియన్ (ఎన్‌సీఈయు), ఇండియన్ నేవల్ సివిల్ ఎంప్లాయీస్ యూనియన్ (ఐఎన్‌సీఈయూ) నాయకులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఎన్‌పీఎస్ రద్దు చేయాలని, కార్మిక కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 11న విశాఖ రక్షణ రంగం మొత్తం సామూహిక నిరాహార దీక్ష చేపట్టాలని, ఆ రోజున కార్మికులెవరూ క్యాంటిన్‌లో భోజనం చేయరాదని, ఇళ్ల నుంచి క్యారేజీలను తెచ్చుకోరాదని కోరారు.

'రాష్ట్రాభివృద్ధి కోసం చంద్రబాబు మళ్లీ సీఎం కావాలి'

పెదగంట్యాడ, జనవరి 8: రాష్ట్రం సమగ్రంగా అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మళ్లీ ముఖ్యమంత్రి కావాలని పార్టీ విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి అన్నారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని సోమవారం అయ్యన్నపాలెం, మొల్లివానిపాలెం కాలనీల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దొమ్మేటి పెరుమాళ్లు, ములకలపల్లి పెంటయ్య, కాకినాడ అప్పలరాజు, దొమ్మేటి సోమునాయుడు, ఎన్.పుష్ప, తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో 4 ఫిర్యాదులు స్వీకరణ

వేపగుంట, జనవరి 8: వేపగుంట జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో నాలుగు ఫిర్యాదులు స్వీకరించారు. 90వ వార్డులో సెయింట్‌ఆన్స్ స్కూల్ పరిసరాల్లో స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలని, 96వ వార్డు దగ్గువానిపాలెంలో అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని, తదితర ఫిర్యాదులందాయి. వీటి పరిష్కారానికి చర్యలు చేపడతామని జెడ్సీ మల్లయ్యనాయుడు పేర్కొన్నారు.



జోనల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు కార్మికులు

కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల ధర్నా

గాజువాక, జనవరి 8: న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేస్తున్న జీవీఎంసీ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు సోమవారం గాజువాక జోనల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ సమ్మె చేస్తున్న కార్మికులకు న్యాయం చేద్దామనే ఆలోచన ప్రభుత్వానికి, పాలకులకు లేదని మండిపడ్డారు. ముఖ్యమంత్రి స్వయంగా ఇచ్చిన హామీకి నేడు విలువ లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంబాబు, అప్పారావు, చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

చెత్తకుప్పకు నిప్పు: ఉక్కిరిబిక్కిరైన ప్రజలు

కూర్మన్నపాలెం, జనవరి 8: కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల సమ్మెతో ఎక్కడ చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. రోజుల తరబడి చెత్త తిష్ట వేయడంతో భరించరాని



కాలుతున్న చెత్తాచెదారం

దుర్వాసన వస్తోంది. ఈ తరుణంలో 87వ వార్డు పరిధి అప్పికొండ కాలనీలో సోమవారం రాత్రి చెత్తాచెదారానికి పలువురు నిప్పంటించారు. అయితే ఆ చెత్తలో ప్లాస్టిక్ వ్యర్థాలు ఉండడంతో పొగ తీవ్రంగా వచ్చింది. దీంతో వృద్ధులు, చిన్నారులు శ్వాసకోస సమస్యలతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఉన్నతాధికారులు స్పందించి చెత్త తరలింపునకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



ఉద్యోగికి అవార్డు అందజేస్తున్న సీజీఎం సోప్తి, తదితరులు

ఉక్కు ఉద్యోగులకు స్పెషల్ ఫెర్ఫార్మెన్స్ అవార్డులు

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 8: స్టీల్‌ప్లాంట్ ఆర్ఎంహెచ్‌పీ విభాగం ఉద్యోగులకు స్పెషల్ పెర్ఫార్మెన్స్ అవార్డులను సోమవారం సీజీఎం (వర్క్స్) సోప్తి, విభాగాధిపతి పరుచూరి శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా సీజీఎం మాట్లాడుతూ ఆర్ఎంహెచ్‌పీ విభాగంలో అధికారులు, కార్మికులు సమష్టి కృషి ఫలితంగా మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. ఉక్కు ఉత్పత్తిని మరింత పెంచేలా ఉద్యోగులు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఉద్యోగుల సంక్షేమానికి యాజమాన్యం తగిన చర్యలు చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు గౌతమ్, సాయి, కన్నయ్య, గోవిందరావు, కార్మిక నాయకులు ఎన్నేటి రమణ, ఎంపీ రమణ, రాజేశ్వరరావు, సురేంద్ర, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

జయహో బీసీ రథం ప్రారంభం



బీసీ రథం వద్ద మేనిఫెస్టో పత్రాలతో టీడీపీ నాయకులు

గాజువాక, జనవరి 8: బీసీలకు వైసీపీ వెన్నుముక అంటూ అన్నివిధాల మోసం చేసిన సీఎం జగన్మోహన్‌రెడ్డికి రానున్న కాలంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని తెలుగుదేశం పార్టీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. గాజువాకలో జయహో బీసీ ప్రచార రథానికి సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్నివిధాల అన్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో బీసీ నాయకులపై అక్రమ కేసులు పెట్టించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. బీసీలకు జరిగిన అన్యాయాన్ని ప్రచారం ద్వారా ప్రజలకు వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తమ్మిన విజయ్‌కుమార్, శివప్రసాద్, నూకరాజు, వరకుమార్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన



ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న మహిళలు, తదితరులు

గాజువాక, జనవరి 8: గత నాలుగు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో 65వ వార్డు పరిధిలోని వాంబే కాలనీవాసులు సోమవారం జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయం వద్దకు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ప్రధాన గేటు వద్ద బైఠాయించి అధికారులు లోపలకు వెళ్లకుండా స్తంభింపజేశారు. సుమారు గంటపాటు నిరసన కార్యక్రమాన్ని కొనసాగించారు. తమ కాలనీలో హ్యాండ్ బోర్లు కానీ ఇతర నీటి సదుపాయాలు గానీ లేకపోవటంతో తాగునీటి కోసం నానాపాట్లు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి సరఫరా విభాగ సిబ్బంది ఆందోళన కారణంగా నాలుగు రోజులుగా మంచినీటి సరఫరా నిలిచిపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు. అధికారులు అలసత్వం వల్లే వాంబే కాలనీకి నీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. ఆందోళనకారులకు టీడీపీ నాయకుడు రట్టి వాసు, తదితరులు మద్దతు పలికారు.

సమగ్రశిక్ష అభియాన్ సిబ్బందికి ఆర్థిక సాయం

పెదగంట్యాడ, జనవరి 8: మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో పనిచేస్తున్న సమగ్రశిక్ష అభియాన్ సిబ్బందికి పెదగంట్యాడ మండల ఉపాధ్యాయులు రూ.67,000 ఆర్థిక సాయాన్ని సోమవారం అందజేశారు. తమ డిమాండ్ల సాధనకు నిరవధిక సమ్మె చేస్తున్న సమగ్రశిక్ష సిబ్బంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్టు గుర్తించిన ఉపాధ్యాయులు ఈ మేరకు సాయం అందించారు. ఎంఈవో శ్రీనివాసరావు చేతులమీదగా ఈ మొత్తాని సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో అన్ని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే నడుపూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కూడా సమగ్రశిక్ష అభియాన్ సిబ్బందికి రూ.30,000 ఆర్థిక సాయం చేశారు. ఎంఈవో కార్యాలయంలో ఈ మొత్తాన్ని హెచ్ఎం రాచకొండ శ్రీనివాస్, ఎంఈవో శ్రీనివాసరావు చేతులమీదగా అందజేశారు.

ఫుట్‌పాత్‌పై ఆక్రమణల తొలగింపు

ఎన్.ఎ.డి.జంక్షన్, జనవరి 8: జీవీఎంసీ 52వ వార్డు పరిధి ఎన్ఏడీ కూడలి కింద ఉన్న రహదారిని, ఫుట్‌పాత్‌ను ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్న వారిపై కంచరపాలెం ట్రాఫిక్ ఎస్.ఐ. వాసుదేవరావు చర్యలు చేపట్టారు. ఫ్లైఓవర్ కూడలి కింద నాలుగు రోడ్ల ఫుట్‌పాత్‌ను ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్న వారి సామగ్రిని తొలగించారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగేలా వ్యాపారాలు సాగించినా, ఫుట్‌పాత్‌లను ఆక్రమించినా తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జ్ఞానాపురం టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది తొలగింపు పనులు చేపట్టారు.

'కార్మిక సంక్షేమమే మా ప్రధాన ధ్యేయం'

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 8: సంస్థ ప్రగతితో పాటు కార్మిక సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఉక్కు నాన్-జేసీఎం కార్మిక సంఘ నాయకులు పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో సోమవారం జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ వేతన సవరణ చేయాలని, సంస్థను సెయిల్‌లో కలపాలని కోరుతూ ఢిల్లీ వెళ్లి వినతిపత్రాలు అంజేస్తామన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు రాష్ట్రంలో గనుల సమస్య లేకుండా చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతామని, ఈ మేరకు మంగళవారం ఉక్కు బీసీ గేటు వద్ద కార్మిక సమస్యల పరిష్కారం కోసం ధర్నా చేస్తామని పేర్కొన్నారు. అలాగే కార్మికుల ప్రధాన సమస్యలను పరిష్కరించడంతో పాటు జిందాల్ సంస్థతో ఎంవోయూ రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వై.మస్తానప్ప, కొమ్మినేని శ్రీనివాసరావు, అప్పారావు, రమణారెడ్డి, సత్యారావు, తదితరులు పాల్గొన్నారు.

'విజ్ఞాన్'కు పోస్టర్ ప్రజంటేషన్‌లో ప్రథమ బహుమతి

అగనంపూడి, జనవరి 8: విజయవాడలో మినిస్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఇటీవల ఏర్పాటు చేసిన ఇన్స్టిట్యూషన్, ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఐఐసీ) రీజనల్ మీట్‌లో పోస్టర్ ప్రజెంటేషన్‌కుగాను దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలకు ప్రథమ బహుమతి లభించింది. కళాశాల ప్రొఫెసర్ అర్చనకు ఐసీసీ జోనల్ ఇన్‌చార్జి సీమా చిల్లార్ చేతులమీదగా బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా కాలేజీ అధ్యాపకులను రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ జె.సుధాకర్‌లు అభినందించారు.

కళలను వెలికి తీయాలి: ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ, జనవరి 8: విద్యార్థులలో అంతర్లీనంగా దాగివున్న కళలను వెలికితీసి బాహ్య ప్రపంచానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జాతీయ జానపద నృత్య పోటీల్లో పాల్గొని ప్రతిభా పురస్కారాలు అందుకున్న నడుపూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులను సోమవారం ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన విద్యా విధానం వల్ల విద్యార్థులలోని కళలను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం రాచకొండ శ్రీనివాస్, విద్యార్థులు నవ్యశ్రీ, తేజేశ్వరి, శ్రీవల్లి, ప్రియాంక, సమాల్, ప్రణతి పాల్గొన్నారు.

ముగిసిన చెకుముకి పోటీలు

ఎన్.ఎ.డి.జంక్షన్, జనవరి 8: ఇక్కడి రామకృష్ణ స్కూల్‌లో జిల్లా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి చెకుముకి పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో 350 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పలువురు విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. గెలుపొందిన విద్యార్థులు గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో పెందుర్తి పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎస్.చంద్రశేఖర్, లాయర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రామాంజనేయులు, జేవీవీ రాష్ట్ర నాయకులు జి.మురళీధర్, పీవీ గోపాలరావు, జిల్లా సైన్స్ అధికారి కె.ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

కనక మహాలక్ష్మికి త్రికాల పంచామృతాభిషేక సేవలు


విశేష అలంకరణలో కనక మహాలక్ష్మి అమ్మవారు

జగదాంబ కూడలి, జనవరి 8: మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా కనక మహాలక్ష్మికి త్రికాల పంచామృతాభిషేక సేవలను ఆలయ అర్చకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం ఆలయంలో జరిగిన పూజల్లో 10 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజల్లో పాల్గొనదలచిన భక్తులు గురువారం రూ.7500, సాధారణ రోజుల్లో రూ.2500లు చెల్లించాలని ఈవో కె.శిరీష తెలిపారు. మార్గశిర ఉత్సవాలను పురస్కరించుకొని అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించు కున్నారు. జగన్నాథ స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం ఆలయం వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ధర్మ ప్రచార ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి రథయాత్ర పెందుర్తి పాపయ్యరాజుపాలేనికి చేరుకుంది.

ఏనుగు పిల్లల కథల పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సత్యనారాయణమూర్తి

సీతమ్మధార, జనవరి 8: ఆధునిక బాల సాహిత్య లక్షణాలతో, మానవీయత అంతర్లీనంగా అల్లుకొని పిల్లల కోసం రాసిన చక్రవర్తి ఏనుగు పిల్లల కథల సంపుటి అందరికీ నచ్చుతుందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి అన్నారు. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యంలో రచయిత ఎస్.హనుమంతరావు రచించిన చక్రవర్తి ఏనుగు సంపుటిని సోమవారం సాయంత్రం స్థానిక పౌరగ్రంథాలయంలో సత్యనారాయణమూర్తి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన తరతరాల సంస్కృతిలో ఉన్న పద్ధతులు, ఆచారాలను నేటి తరం పిల్లలకు అర్థమయ్యే రీతిలో కథలు ఉన్నాయని చెప్పారు. ప్రముఖ కవి గరిమెళ్ళ నాగేశ్వరరావు పుస్తక సమీక్ష చేశారు. వాస్తవిక ఘటనలను ప్రతిబింబించే విధంగా రచయిత రచనలు చేశారన్నారు. అరసం జిల్లా కార్యదర్శి ఉప్పల అప్పలరాజు అధ్యక్షత వహించగా, బేతా రామసూర్యప్రకాశరావు, అడపా రామకృష్ణ, ఎంవీవీ సత్యనారాయణ, డీవీ సూర్యారావు, బండి సత్యనారాయణ, ఎం.పైడిరాజు, సీఎన్ క్షేత్రపాల్, పి.శ్యాంసుందర్ పాల్గొన్నారు.

ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయ హుండీల లెక్కింపు

సీతమ్మధార, జనవరి 8: స్థానిక నక్కవానిపాలెంలోని శ్రీ ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయ హుండీలను సోమవారం లెక్కించారు. నాలుగు నెలల 25 రోజులకు గాను రూ.3,14,369ల ఆదాయం వచ్చింది.

'జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి'

మహారాణిపేట, జనవరి 8: జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని కలెక్టర్ ఎ.మల్లికార్జునను తెలుగు యువత నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పెంటిరాజు, తాతాజీ, శ్రీనివాసరావు, గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

అక్కయ్యపాలెం, జనవరి 8: జీవీఎంసీ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 122 మంది విద్యార్థినీ, విద్యార్థులకు సోమవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. అబుదాబి (యూఏఈ)లో నివాసముంటున్న సిరిపురపు బలరామకృష్ణ, జయలక్ష్మి దంపతులు, వారి కుమార్తె ఐశ్వర్య రూ.25వేల విలువ గల స్టడీ మెటీరియల్‌ను అందజేశారని పాఠశాల ప్రధానోపాధ్యాయిని బి.లక్ష్మీనరస తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్.శ్రీనివాసరావు, ఏజే జ్యోతి, ఆర్.రాధిక, పి.పద్మలత, కె.మాణిక్యం, ఎ.రామలక్ష్మి, పి.లలిత, ఎంవీ ధర్మారావు, ఎ.సునంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్ర, బెంగాల్ మధ్య రంజీ మ్యాచ్ డ్రా

విశాఖపట్నం (స్పోర్ట్సు), జనవరి 8: ఏసీఏ, వీడీసీఏ స్టేడియంలో ఆంధ్ర, బెంగాల్ మధ్య జరిగిన రంజీ మ్యాచ్ డ్రాగా ముగిసింది. చివరి రోజు ఆటలో 339/6 ఓవర్‌నైట్ స్కోరుతో సోమవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర 445 పరుగులకు ఆలౌటై 39 పరుగుల ఆధిక్యత సాధించింది. వ్యక్తిగత అజేయ సెంచరీతో (107 నాటౌట్) బ్యాటింగ్ కొనసాగించిన రిక్కీ బుయ్ 175 పరుగులు చేసి అవుటయ్యాడు. ఇక 31 నాటౌట్ పరుగుల వ్యక్తిగత స్కోరుతో బ్యాటింగ్ చేసిన షోయబ్ మహ్మద్ ఖాన్ అర్ధ సెంచరీ (56) సాధించాడు. బెంగాల్ బౌలర్లలో మహ్మద్ కైఫ్ మూడు, ఆకాష్ దీప్ రెండు వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్ బ్యాటింగ్‌కు దిగిన బెంగాల్ చివరి రోజు ఆట ముగిసే సరికి 25 ఓవర్లలో ఒక వికెట్ నష్టపోయి 82 పరుగులు చేయడంతో మ్యాచ్ డ్రా అయింది.

రాష్ట్రాభివృద్ధి కోసం వైసీపీకి రాజీనామా

» ఆంధ్రప్రదేశ్ స్వర్ణకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కర్రి వేణుమాధవ్


సమావేశంలో మాట్లాడుతున్న కర్రి వేణు మాధవ్

మహారాణిపేట, జనవరి 8: ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం వైసీపీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు జాతీయ బీసీ సంఘం అధికార ప్రతినిధి, ఆంధ్రప్రదేశ్ స్వర్ణకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కర్రి వేణుమాధవ్ ప్రకటించారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి కుంటుపడుతున్న నేపథ్యంలో ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ నాయకులతో చర్చించి ఏ పార్టీలో చేరాలనే నిర్ణయం తీసుకుంటానని, ఆ విషయాన్ని త్వరలో ప్రకటిస్తానని చెప్పారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సాధికారక కమిటీ చైర్మన్ గోడి నరసింహాచారి, ఆంధ్ర ప్రదేశ్ స్వర్ణకారుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పక్కి కొండబాబు, స్వర్ణకార నాయకులు ముదపాక రవి, పెదపూడి బ్రహ్మాజీ, ఈర్ని ప్రకాశ్, చిట్టూరి సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అరుస్తాయ్.. కరుస్తాయ్..

» ఉత్తర నియోజకవర్గంలో కుక్కల స్వైర విహారం
» గుంపులుగా తిరుగుతూ పాదచారులపై దాడులు
» భీతిల్లుతున్న జనం



అక్కయ్యపాలెం, జనవరి 8: ఉత్తర నియోజకవర్గంలోని పలు వార్డుల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులుగా తిరుగుతూ పాదచారులు, ద్విచక్ర వాహన చోదకుల వెంట పడి కరిచేస్తున్నాయి. దీంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. కుక్కల నియంత్రణకు జీవీఎంసీ అధి కారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని వాపోతున్నారు.

జీవీఎంసీ 42, 43, 44, 45, 46 వార్డుల్లోని పలు ప్రాంతాల్లో వీధి కుక్కలు అధికంగా ఉన్నాయి. రోడ్లపై గుంపులుగా సంచరిస్తున్నాయి. దీంతో వాటిని తప్పించుకొని నడవాలంటే జనం భయాందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో అయితే పరిస్థితి మరీ దారుణంగా ఉంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంకటరాజు నగర్, టీఎస్ఎన్ కాలనీ, రైల్వేన్యూకాలనీ, శ్రీనివాసనగర్, రామచంద్రానగర్, అబిద్‌నగర్, ఎన్‌జీజీఓస్ కాలనీ, శంకువానిపాలెం, చాకలిపేట, నరసింహనగర్, సాలిగ్రామపురం, లక్ష్మీనారాయణపురం, కస్తూరినగర్, కైలాసపురం, మధుసూదన్‌నగర్ తదితర ప్రాంతాల్లో కుక్కలు విచ్చలవిడిగా సంచరించడంతో చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


42వ వార్డు వెంకటరాజునగర్‌లో గుంపుగా ఉన్న కుక్కలు

జగన్ పాలనపై జనంలో విసుగు

» ప్రచారమే తప్ప నవరత్నాల అమలు శూన్యం
» టీడీపీ విశాఖ దక్షిణ ఇన్‌చార్జి గండి బాబ్జీ


మాట్లాడుతున్న గండి బాబ్జీ

విశాఖపట్నం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనపై అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయి ఉన్నారని టీడీపీ విశాఖ దక్షిణ ఇన్‌చార్జి గండి బాబ్జీ విమర్శించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ నవరత్నాలు అమలు చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్నారు తప్ప క్షేత్రస్థాయిలో అందుకు భిన్నంగా ఉందని ఆరోపించారు. నవరత్నాల్లో 98 శాతం ప్రజలకు చేరాయని చేస్తున్న ప్రచారం అబద్ధమన్నారు. విద్యుత్ బిల్లు 300 యానిట్లు దాటితే రేషన్‌కార్డు కట్‌చేయడంతోపాటు పింఛన్, ఇతర పథకాలు నిలిపివేస్తున్నారని, దీనిపై బహిరంగ చర్చకు రావాలని అధికార పార్టీ నాయకులకు సవాల్ చేశారు. దేశంలో తొలిసారిగా శాసనసభ్యులను ఎన్నికైన నియోజకవర్గం నుంచి మరో నియోజకవర్గానికి బదిలీ చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన రెడ్డిని వచ్చే ఎన్నికల్లో ప్రజలు రాష్ట్రం నుంచి బదిలీ చేయడం ఖాయమన్నారు. తెలుగుదేశం పార్టీ రాజమండ్రిలో విడుదల చేసిన మినీ మేనిఫెస్టోలో ఆరు అంశాలలో మూడింటిని ఇప్పుడే అమలుచేస్తామని వైసీపీ ప్రభుత్వం చెబుతుందని వ్యాఖ్యానించారు. అంటే తెలుగుదేశం ప్రకటించింది కాబట్టి ఇప్పుడు అమలుచేస్తారా? అని ప్రశ్నించారు. మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం కల్పించాలని ప్రభుత్వం ఆలోచిస్తోందని, ఒకవేళ దీనిని అమలుచేస్తే తెలుగుదేశం ఉచిత బస్సు ప్రయాణమని చెప్పుకోవాల్సి ఉంటుందన్నారు. విశాఖ పరిసరాల్లో టీడీపీ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లకు వైసీపీ రంగులు వేశారు తప్ప అక్కడ మౌలిక వసతుల సంగతి మర్చిపోయారని బాబ్జీ దుయ్యబట్టారు.

జీవీఎంసీ కాంట్రాక్టు కార్మికులకు టీడీపీ సంఘీభావం

డాబాగార్డెన్స్, జనవరి 8: జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం సరస్వతి పార్కు వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో టీడీపీ విశాఖ పార్లమెంట్ ఇన్‌చార్జి శ్రీ భరత్, దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ పాల్గొని వారికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగుల పర్మినెంట్, పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మెకు తాము పూర్తిగా మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. కార్మికులకు టీడీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.


కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న శ్రీ భరత్, పక్కన గండి బాబ్జీ

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాలు


కళాశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్న దృశ్యం

డాబాగార్డెన్స్, జనవరి 8: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సంక్రాంతి పండగ ముందే వచ్చింది. సంప్రదాయ వస్త్రధారణతో విద్యార్థినులు సోమవారం సందడి చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న సమాజంలో పాశ్చాత్య నాగరికత ప్రాధాన్యం పెరుగుతున్నప్పటికీ సనాతన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను, మన పండగలను మరువరాదని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి ఎన్‌వీ పద్మకుమారి, వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, అరుణపద్మ, బి.రాధమ్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏపీయూఎస్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

అక్కయ్యపాలెం, జనవరి 8 : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీయూఎస్) రూపొందించిన నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్లను కలెక్టర్ ఎ.మల్లికార్జున సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర బాధ్యులు ఎంపీ శ్రీనివాస్, చిరంజీవి, జిల్లా ప్రధానాధ్యక్షుడు అవనా అరుణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి త్రినాథమూర్తి, జిల్లా మహిళా కార్యదర్శి ఎ.రామలక్ష్మి, జిల్లా కోశాధికారి, నగర కార్యదర్శి ఎంఎస్‌వీ విశ్వనాథం పాల్గొన్నారు.

జోన్-5లో స్పందనకు ఐదు అర్జీలు

జ్ఞానాపురం, జనవరి 8: జీవీఎంసీ జోన్-5 పరిధిలో వచ్చే జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో వచ్చే అర్జీలపై అధికారులు అలసత్వం వహించవద్దని, వెంటనే పరిష్కరించడానికి కృషి చేయాలని అధికారులను జడ్సీ ఆర్‌జీవీ కృష్ణ ఆదేశించారు. జ్ఞానాపురం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్న కు చెబుదాం (స్పందన) కార్యక్రమానికి ఐదు అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో సునీల్‌కుమార్, ఈఈ ప్రసన్నరెడ్డి, ఈఈ ఎం.రాజు, ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, సూపరింటెండెంట్ టీఎస్ఎన్ రాజు, ఏపీడీ పద్మావతి, చిరంజీవి, తదితరుల పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

అల్లిపురం, జనవరి 8: సముద్రంలో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తూ మృతి చెందిన విశాఖపట్నం హార్బర్ వర్కర్స్ యూనియన్ సభ్యుడు మారుపల్లి అప్పన్న కుటుంబానికి ఏఐటీయూసీ తరఫున యూనియన్ గౌరవాధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి రూ.2.1 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వంకా గురుమూర్తి, అధ్యక్షుడు కోడా వజ్రం, కార్యదర్శి పాత్రిపల్లి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అరగుండుతో మునిసిపల్ కార్మికుల నిరసన


సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యవైఖరికి నిరసనగా విశాఖలో అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు మునిసిపల్ కార్మికులు సోమవారం అరగుండు చేయించుకున్నారు. సోమవారం కార్మికులు జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు.
- విశాఖపట్నం/ ఆంధ్రజ్యోతి

నూతన పింఛన్ల పంపిణీ


నూతన పింఛన్ల నమూనా చెక్కు అందజేస్తున్న కేకే రాజు

అక్కయ్యపాలెం, జనవరి 8 : జీవీఎంసీ 44వ వార్డు ముస్లిం తాటిచెట్లపాలెంలోని షాదీఖానాలో ఉత్తర నియోజకవర్గం పరిధిలోని అన్ని వార్డులకు సంబంధించి 384 మందికి నూతనంగా మంజూరైన పింఛన్లను వైసీపీ ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు సోమవారం పంపిణీ చేశారు. అనంతరం కొత్తగా ఎంపికైన వలంటీర్లకు నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్‌లీడర్ బానాల శ్రీనివాసరావు, జోనల్ కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, ఏపీడీ పద్మావతి, కార్పొరేటర్లు పెద్దిశెట్టి ఉషశ్రీ, అక్ష లీలావతి శ్రీనివాస్, కంటిపాము కామేశ్వరి, రెయ్యి వెంకటరమణ, 45వ వార్డు అధ్యక్షుడు పైడి రమణ తదతరులు పాల్గొన్నారు.

బీసీల రక్షణకు టీడీపీ కృషి

మహారాణిపేట, జనవరి 8: బీసీల ఆత్మ గౌరవాన్ని కాపాడడానికి, వారి రక్షణకు టీడీపీ కృషి చేస్తుందని ఆ పార్టీ విశాఖ పార్లమెంట్ ఇన్‌చార్జి ఎం.శ్రీ భరత్ అన్నారు. సోమవారం జయహో బీసీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం 25 వేల మంది బీసీలపై అక్రమ కేసులు బనాయించి వారిని అన్ని విధాలుగా ఇబ్బందులకు గురిచేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వనితా వాకర్స్ క్లబ్‌లో ముగ్గుల పోటీలు

మాధవధార, జనవరి 8: సంక్రాతి సంబరాల్లో భాగంగా జీవీఎంసీ 50వ వార్డు మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. వైశాఖీ స్పోర్ట్సు పార్కు వాకింగ్ ట్రాక్‌లో నిర్వహించిన పోటీల్లో అతివలు రంగవల్లులను అందంగా తీర్చిదిద్దారు. పండగ ముందు రోజు విజేతలకు బహుమతులను అందిస్తామని వనితా వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ పి.ప్రభావతి తెలిపారు. కార్యక్రమంలో వైశాఖీ స్పోర్ట్సు పార్కు కమిటీ అధ్యక్షుడు సనపల వరప్రసాద్ పాల్గొన్నారు.

మాధవధారలో వికసిత భారత్


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న విష్ణుకుమార్ రాజు

మురళీనగర్, జనవరి 8: జీవీఎంసీ 51వ వార్డు మాధవధారలో సోమవారం వికసిత భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. జీవీఎంసీ కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు ప్రారంభించారు. జీవీఎంసీ జోన్-5 ఏపీడీ పద్మావతి, నియోజకవర్గ కన్వీనర్ సురేశ్‌బాబు తదితరుల పర్యవేక్షణలో కల్యాణ మండపం వద్ద వైద్య పరీక్షలు నిర్వహించారు.

ఎన్నికల నిర్వహణకు నోడల్ అధికారులు

... 5వ పేజీ తరువాయి

ఎస్వీఈఈపీకి సాంఘిక సంక్షేమ శాఖ జేడీ కంచరాన రామారావును, పరిశీలకుల లైజనింగ్ కోసం జిల్లా సర్వే ఏడీ కె.సూర్యారావును నోడల్ అధికారులుగా నియమిస్తూ కలెక్టర్ ఎ.మల్లికార్జున ఉత్తర్వులు జారీచేశారు. కాగా జిల్లాలో పనిచేస్తున్న తహసీల్దార్ల బదిలీలకు సంబంధించి కూడా కసరత్తు చేస్తున్నారు. ఇద్దరు, ముగ్గురు తప్ప మిగిలిన తహసీల్దార్లకు నెలాఖరులోగా బదిలీ అవుతుందని చెబుతున్నారు. ఇప్పటికే తహసీల్దార్ల జాబితాను ప్రభుత్వానికి పంపించారు.

ఫ్లైఓవర్‌లపై పైపై మాటలేనా!?

... 5వ పేజీ తరువాయి

విమానాశ్రయం ముందు వచ్చే ఎన్ఏడీ జంక్షన్‌లో ట్రాఫిక్ సమస్య చాలా తీవ్రంగా ఉందని గుర్తించిన నాటి సీఎం చంద్రబాబునాయుడు రూ.150 కోట్లతో ఫ్లైఓవర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రత్యేకంగా డిజైన్లు తయారు చేయించి చకచకా పనుల పూర్తికి యత్నించారు. ఇంకో ఆరు నెలల్లో ప్రాజెక్టు పూర్తవుతుందనగా, ప్రభుత్వం మారిపోయి వైసీపీ అధికారంలోకి వచ్చింది. దానికి సీఎం జగన్ చేతులు మీదుగా శంకుస్థాపన చేసి తామే నిర్మించినట్టు ఆ పార్టీ ప్రచారం చేసుకుంటోంది. ఈ ప్రాజెక్టులో భాగంగానే ఎన్ఏడీ జంక్షన్‌కి, విమానాశ్రయానికి మధ్య రైల్వేతో కలిసి అండర్ పాస్‌వే నిర్మించాల్సి ఉంది. ఈ ప్రభుత్వం వచ్చి నాలుగున్నరేళ్లు గడిచినా ఆ పనిలో 50 శాతం కూడా పూర్తి కాలేదు. అందులో కేవలం 25 శాతమే పూర్తయిందని వీఎంఆర్‌డీఏ కమిషనర్ హోదాలో కలెక్టర్ మల్లికార్జున ఇటీవలె వెల్లడించారు. వచ్చే సెప్టెంబరు నాటికి కాని పూర్తిచేయలేమని చెప్పేశారు. అంత పెద్ద ఫ్లైఓవర్‌ని టీడీపీ హయాంలో రెండేళ్లలో 80 శాతం పూర్తి చేస్తే, కేవలం అండర్ పాస్‌వే నిర్మాణాన్ని వైసీపీ పూర్తి చేయలేకపోవడం గమనార్హం.

12 చోట్ల ఫ్లైఓవర్ల ప్రతిపాదన

విశాఖపట్నంలో ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారం అంతా ఎండాడ, మధురవాడ, కొమ్మాది, ఆనందపురాల్లో నడుస్తోంది. అధికార పార్టీ నాయకులకు అటు వైపు వేల కోట్ల రూపాయల ప్రాజెక్టులు ఉన్నాయి. అయితే ట్రాఫిక్ కారణంగా అంత దూరం వెళ్లడానికి నగర ప్రజలు ఇష్టపడడం లేదు. హనుమంతవాక, ఎండాడ, కారుషెడ్ జంక్షన్లు బాగా ఇబ్బందికరంగా మారిపోయాయి. ఈ నేపథ్యంలో ఫ్లైఓవర్ల నిర్మాణం చేపడితే తప్ప ప్రజలు అటు వెళ్లరని గుర్తించి ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో పలువురు ఢిల్లీ వెళ్లి కేంద్ర పెద్దలను కలిశారు. అనకాపల్లి నుంచి విశాఖపట్నం మీదుగా ఆనందపురం వెళ్లే జాతీయ రహదారిలో 12 చోట్ల ఫ్లైఓవర్లు నిర్మించాలని కోరారు.

కూర్మన్నపాలెం, గాజువాక, షీలానగర్, మురళీనగర్, తాటిచెట్లపాలెం, సత్యం జంక్షన్, మద్దిలపాలెం, ఇసుకతోట, హనుమంతవాక జంక్షన్, ఎండాడ, కారుషెడ్ జంక్షన్, కొమ్మాది ప్రాంతాల్లో ఫ్లైఓవర్లకు ప్రతిపాదించారు. ఇదంతా 2020లో జరిగింది. అనేక సంప్రతింపుల తరువాత 2022లో ఎన్‌హెచ్‌ఏఐ అనకాపల్లి నుంచి విశాఖపట్నం మధ్య 58 కి.మీ. మార్గంలో ఫ్లైఓవర్ల నిర్మాణంపై సమగ్ర ప్రాజెక్టు నివేదికలు తయారు చేయడానికి బిడ్లను ఆహ్వానించింది. అవి ఏమయ్యాయో తెలియదు. ఏ ఫ్లైఓవర్‌కు ఎంత వ్యయం అవుతుందో అంచనాలు లేవు. కానీ వైసీపీ నాయకులు మాత్రం అవిగో ఫ్లైఓవర్లు...ఇవిగో ఫ్లైఓవర్లు అంటూ ఊదరగొడుతున్నారు. దీనిపై ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు నోరు విప్పి మాట్లాడడం లేదు. కేంద్రం ఈ ప్రాజెక్టు చేపడతానన్న మాట వాస్తవం. కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ దీనిపై పార్లమెంటులో కూడా మాట్లాడారు. రైల్వే జోన్ ఎలాగైతే ఇస్తామని చెప్పి సాగదీసుకువస్తున్నారో...ఇది కూడా అంతే. డీపీఆర్‌లు లేవు. అంచనా వ్యయాలు లేవు. కానీ శంకుస్థాపనలు మాత్రం చేసేస్తామని వైసీపీ నాయకులు ప్రకటనలు చేస్తున్నారు. ఎన్ఏడీలో ఫ్లైఓవర్ నిర్మించి ఇస్తే దానికి అండర్ పాస్‌వే ఏర్పాటుచేయలేకపోయిన పాలకులు ఏకంగా 12 ఫ్లైఓవర్లు నిర్మించేస్తామని చెబుతుంటే...విశాఖ ప్రజలు విస్తుపోతున్నారు.

పెందుర్తి నుంచి అమర్‌కు చాన్స్?

... 5వ పేజీ తరువాయి

అధిష్ఠానాన్ని కోరారంటున్నారు. గతంలో తన తాత అప్పన్న, తండ్రి గురునాథరావు కూడా పెందుర్తి నుంచే పోటీ చేసి గెలిచినందున తనకు అక్కడ నుంచి పోటీకి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేసినట్టు సమాచారం. అక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌పై వ్యతిరేకత ఉందంటూ అతడిని మార్చే ప్రతిపాదన అధిష్ఠానం వద్ద ఉండడం...అమర్‌నాథ్‌కు కలిసొచ్చినట్టయిందని పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు. ఇదిలావుండగా గుడివాడ అమర్‌నాథ్‌కు పెందుర్తి టికెట్ కేటాయించనున్నారనే ప్రచారం సిట్టింగ్ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ శిబిరంలో కలవరం రేపుతోంది. మరి...అదీప్‌రాజ్‌ను ఎక్కడ నుంచి పోటీకి దింపుతారని ఆయన అనుచరులు ప్రశ్నిస్తున్నారు. ఆయన్ను కాకుండా వేరెవరినో తమపై రుద్దితే వారి విజయానికి తాము పనిచేసేది లేదని అంటున్నట్టు సమాచారం.

కోడి నేలచూపులు

... 5వ పేజీ తరువాయి

రోజుల్లో సగటున మూడు నుంచి ఐదు లక్షల కోళ్ల అమ్మకాలు సాగుతున్నాయి. అయితే ఉత్తరాంధ్రలో కొత్తగా కంపెనీలు రావడంతో ఉత్పత్తి ఎంత అనేది కచ్చితంగా చెప్పలేకపోతున్నామని బ్యాగ్ అధ్యక్షుడు కొట్యాడ శ్రీనివాసరావు తెలిపారు. వినియోగం కంటే ఉత్పత్తి ఎక్కువగా ఉంటుందని మాత్రం చెప్పగలమని పేర్కొన్నారు. ఒడిశా మార్కెట్ నుంచి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలతోపాటు ఒక్కొక్కసారి నగరానికి కోళ్లు వస్తున్నాయన్నారు. సంక్రాంతికి రేటు పెరిగే అవకాశం ఉందని, అయితే లాభాలు వచ్చేంత ధరలు రాకపోవచ్చునని అంచనా వేస్తున్నారు. కాగా కంపెనీల మధ్య పోటీతో రైతులు కుదేలైపోయారని బ్యాగ్ మాజీ అధ్యక్షుడు తాత్రాజు అప్పారావు ఆవేదన వ్యక్తంచేశారు. దేశంలో అన్ని ప్రాంతాల్లో కంపెనీల జోరుకు రైతులు నిలబడలేక తిరిగి కంపెనీలు ఇచ్చే పిల్లలు పెంచుకుంటున్నారని, దీనివల్ల కూడా పెద్దగా ఆదాయం రావడం లేదన్నారు. అన్నిరకాల నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని, కోడి మాంసం ధర మాత్రమే తగ్గుతుందన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని కోళ్ల పరిశ్రమను ఆదుకోవాలని కోరారు.

అంగన్‌వాడీలపై ఒత్తిళ్లు

... 5వ పేజీ తరువాయి

ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని సంఘ జిల్లా ప్రెసిడెంట్ తులసి స్పష్టంచేశారు. ఇప్పటివరకూ శాంతియుతంగా సమ్మె చేస్తున్న తాము ఇకపై రోడ్లపైకి రావాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఎస్మా పేరుతో బెదిరించడం సరికాదని హెల్పర్‌గా పనిచేస్తున్న కె.అచ్చియ్యమ్మ ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం ఇచ్చే జీతం కనీసం ఇంటి అద్దెకు కూడా సరిపోవడం లేదన్నారు. వేతనం రూ.26 వేలు చేయాలని, అప్పటివరకూ సమ్మెలోనే ఉంటామని అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్న పి.కృపారాణి స్పష్టంచేశారు. నిరంకుశ చర్యలతో ప్రభుత్వానికి చేటు అని, ఎన్నికల్లో తగిన మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తుందని పలువురు ఉద్యోగులు ఆగ్రహాన్ని వ్యక్తంచేశారు.

రైళ్లు ఫుల్

... 5వ పేజీ తరువాయి

ఎక్స్‌ప్రెస్‌లతోపాటు విశాఖ-బెంగళూరు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ (08543), భువనేశ్వర్-బెంగళూరు హంసఫర్ (22833), హౌరా-బెంగళూరు హంసఫర్ (22887), హౌరా-బెంగళూరు దురంతో (12245), హటియా-బెంగళూరు (12835), గుహవటి-బెంగుళూరు (12510), భగల్‌పూర్-బెంగుళూరు అంగా ఎక్స్‌ప్రెస్ (12254), అగర్తాల-బెంగళూరు హంసఫర్ (12504), కామాఖ్య-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12552), పూరి-యశ్వంత్‌పూర్ గరీబ్‌రథ్ (22833), టాటా-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (18111), జసిడిన్ జంక్షన్-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (22306), టాటా-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12889), హౌరా-మైసూర్ ఎక్స్‌ప్రెస్ (22817), భువనేశ్వర్-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12845), హటియా-బెంగుళూరు ఎక్స్‌ప్రెస్ (18637), న్యూ టిన్సుకియా-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (22502), హౌరా-బెంగళూరు ఏసీ ఎక్స్‌ప్రెస్ (22863), ముజాఫర్‌పూర్-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (15228) రైళ్లలో బెర్తులు జనవరి 30 వరకూ రిజర్వు అయిపోయాయి. అయితే రెండు, మూడు వారాంతపు రైళ్లకు జనవరి 26 నుంచి కొన్ని బెర్తులు అందుబాటులో ఉండగా విశాఖ-బెంగళూరు ప్రత్యేక రైలుకు 28న థర్డ్ ఏసీ బెర్తులు ఉన్నాయి. ఇక భువనేశ్వర్ చుట్టుపక్కల ప్రాంతాలకు వెళ్లే రైళ్లకు పండగ అనంతరం డిమాండ్ ఎక్కువగా ఉంది.

'జనబాగీదారీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి'

మహారాణిపేట, జనవరి 8: అమరావతిలోని స్వరాజ్ మైదానంలో జనవరి 19 వ తేదీన 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్న నేపథ్యంలో జనబాగీదారీ పేరిట ఈ నెల 9 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న జిల్లా స్థాయి చైతన్య కార్యక్రమాలలో అందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్ కోరారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం 7 గంటలకు స్థానిక ఎల్ఐసీ బిల్డింగ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం నుంచి రామాటాకీస్ వద్ద అంబేడ్కర్ భవన్ వరకు మారథాన్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అలాగే ఉదయం 9 గంటలకు అంబేడ్కర్ భవన్‌లో రక్తదాన శిబిరం, అంబేడ్కర్ జీవిత చరిత్రపై తీసిన షార్టు ఫిల్మ్, జిల్లా స్థాయి ఫొటో ఎగ్జిబిషన్ ఉంటాయని తెలిపారు. 18వ తేదీ ఉదయం 9 గంటలకు అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రజాప్రతినిధులతో మానవహారం, ప్రతిజ్ఞ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో నర్సింగరావుకు పతకాలు

డాబాగార్డెన్స్, జనవరి 8: ఏపీ స్టేట్ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో నగరానికి చెందిన ఎ.నర్సింగరావు పలు పతకాలు సాధించారు. విశాఖపట్నం రైల్వే గ్రౌండ్స్‌లో ఈ నెల 6, 7 తేదీల్లో నిర్వహించిన లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానం, జావెలిన్ త్రోలో ప్రథమ స్థానం, ట్రిపుల్ జంప్‌లో ద్వితీయ స్థానం సాధించారు.


దెబ్బతిన్న బడ్డీలు

అర్ధరాత్రి కారు బీభత్సం

సాగర్‌నగర్, జనవరి 8 : బీచ్ రోడ్డులోని సాగరేశ్వరాలయం వద్ద ఆదివారం అర్ధరాత్రి ఓ కారు బీభత్సం సృష్టించింది. కారు అతివేగంగా దూసుకువచ్చి బడ్డీలను ఢీకొట్టడంతో అందులోని వస్తువులు చిందరవందరమయ్యాయి. బడ్డీలు ఐరన్‌తో చేసినప్పటికీ కారు వేగానికి తునాతునకలు అయ్యాయి. బడ్డీల్లో ఎవరైనా నిద్రించి వుంటే ప్రాణ నష్టం జరిగేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. దుకాణాల్లోని వస్తువులు పాడవ్వడంతో వ్యాపారులు లబోదిబోమంటున్నారు.

కమనీయం అప్పన్న నిత్య కల్యాణం



సింహాచలం, జనవరి 8 : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం సోమవారం కమనీయంగా సాగింది. వేకువజామున స్వామివారిని మేల్కొలిపి సుప్రభాత సేవ, ప్రభాతారాధనలు జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం కల్యాణ క్రతువు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేష వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

అప్పన్న రథానికి రక్షణ కరువు

సింహాచలం, జనవరి 8 : అప్పన్న స్వామికి చైత్ర మాస శుక్ల పక్ష ఏకాదశి నాడు జరిగే వార్షిక తిరు కల్యాణోత్సవంలో వినియోగించే రథాన్ని భక్తుల సహకారంతో సోమవారం బయటకు తీశారు. ప్రస్తుతం ఈ రథం త్రిపురాంతక స్వామి ఆలయానికి ఎదురుగా ఉంది. ఆ ప్రాంతంలో ప్రసాద్ పథకం కింద క్యూ కాంప్లెక్స్ నిర్మిస్తుండడంతో ఈఓ శ్రీనివాస మూర్తి సమక్షంలో బయటకు తీసి ఎస్‌బీటీ గేటుకు సమీపంలో పార్కింగ్ చేశారు. ఎటువంటి ముందస్తు ప్రణాళిక లేకుండా రథాన్ని బయటకు తీయడాన్ని భక్తులు తప్పుపడుతున్నారు. ప్రసాద్ పథకంలో రథం నూతన షెడ్ నిర్మాణ అంశం లేదు. అలాగే రథాన్ని ఎక్కడ ఉంచాలన్న దానిపై కూడా సరైన విధి విధానాలు లేవు. దీంతో రథానికి ప్రస్తుతం నీడ, రక్షణ కరువైందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు అందని వేతనాలు

మధురవాడ, జనవరి 8 : వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులకు ప్రభుత్వం గత నెల వేతనాలను ఇంతవరకు జమ చేయలేదని ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం నాయకులు వి. వీరబ్రహ్మం, ఎంవీవీ గోపీనాథ్ తెలిపారు. సోమవారం వారు ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ ఆస్పత్రుల్లో సుమారు 1500 మందికి పైగా ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు ఉన్నారని, పండుగ సమీపిస్తున్నా.. ఇంతవరకు వేతనాలు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలని కోరారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు

తగరపువలస, జనవరి 8 : జీవీఎంసీ రెండో వార్డు వలందపేటలోని చాకలిపేటకు చెందిన బోయి మహేష్ (30) కొద్ది రోజులుగా కనిపించడం లేదని అతని కుటుంబ సభ్యులు భీమిలి పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. మహేష్‌కు ఏడాది క్రితం వివాహం జరిగింది. అతనికి కొంత అప్పులు ఉన్నాయి. ఈమేరకు ఈనెల 5న ఉదయం టిఫిన్‌కి వెళతానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్ కావడం, స్థానికంగా వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు అతని భార్య శ్యామల తెలిపారు.

సినిమా గైడ్

- **డెవిల్ :** జగదాంబ, వెంకటేశ్వర, కామేశ్వరి, శ్రీకన్య, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), దుర్గ (మధురవాడ), తాతా (తగరపువలస)
- **బబుల్ గమ్ :** శరత్, రమాదేవి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **సలార్ :** మెలోడి, సంగం, శారద, శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లిఖిత(శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **పిండం :** మోహిని (గాజువాక)
- **ఆక్వామెన్ :** సుకన్య(గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **హాయ్ నాన్న :** మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), గణేష్ (తగరపువలస),

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 25, టమాటా 20, వంకాయలు (తెలుపు) 30, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 60, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 52, బీరకాయలు 56, ఆనపకాయలు 20, కాలీఫ్లవర్ 20, క్యాబేజ్ 18, క్యారెట్ 38, దొండకాయలు 30, బంగాళా దుంపలు 19, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 76, అల్లం (పాతది) 110, బరబటి 52, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 44, దోస కాయలు 34, వెల్లుల్లి (పెద్దవి) 230, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 40 , ఆగాకర 84, పొటల్స్ 54, కీరదోస 24, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 15, చేమదుంపలు 56, చిలగడదుంపలు 30 , కంద 56, దేముడు చిక్కుడు 35, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 26, మామిడి అల్లం 60, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	625
విజయనగరం	629
శ్రీకాకుళం	629

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	-- 65
ఫారం ధర	-- 85
విత్ స్కిన్	-- 140
స్కిన్‌లెస్	-- 150

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..


మధురవాడలోని ఏడో వార్డు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు


తగరపువలసలో జోనల్ కమిషనర్ రాముతో కార్మికుల వాగ్వాదం

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె

మధురవాడ, జనవరి 8 : జోన్ 2 పరిధిలోని ఏడో వార్డు కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జోనల్ కార్యదర్శి డి.అప్పలరాజు మాట్లాడుతూ 14 రోజులుగా పారిశుధ్య కార్మికులు సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. చర్చల పేరుతో కాలయాపన చేసి కార్మికులబతుకుల్లో వెలుగు లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, క్లాప్ వాహన డ్రైవర్లకు జీఓ నంబరు 7 ప్రకారం నెలకు రూ. 18,500 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నాలో కార్మిక సంఘం నాయకులు రాంబాబు, గోవింద, కె.సుజాత, బి.అప్పలరెడ్డి, ఎ. అశోక్, కె. సన్నీ, తదితరులు పాల్గొన్నారు.

చెత్త తరలింపు అడ్డగింత

తగరపువలస : ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకపోతే ప్రజాప్రతినిధుల ఇళ్ల ముందు చెత్త వేస్తామని పారిశుధ్య కార్మికుల సంఘం గౌరవాధ్యక్షుడు మూర్తి హెచ్చరించారు. సోమవారం ఉదయం తగరపువలస సంత వద్ద జోనల్ కమిషనర్ రాము ప్రైవేటు సిబ్బందితో చెత్త ఎత్తిస్తుండగా సమ్మె చేస్తున్న కార్మికులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించకుండా ఇతరులతో పనులు చేయించడం సరికాదన్నారు. మరోసారి ఇలా చేస్తే చెత్తను ఎమ్మెల్యేలు,మంత్రుల ఇళ్ల ముందు వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు సురేష్, రాజేష్, వెంకటరావు, నరసింగరావు పాల్గొన్నారు.


13వ వార్డులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీ సత్యనారాయణ

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎంపీ ఎంవీవీ

ఆరిలోవ,జనవరి 8 : తూర్పు నియోజకవర్గంలో ఉన్న అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని నియోజకవర్గ సమన్వయకర్త, ఎంపీ ఎంవీవీ సత్యన్నారాయణ అన్నారు. సోమవారం ఆయన 12వ వార్డులో కార్పొరేటర్ అక్కరమాని రోహిణి రామన్ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పథకాలు అందని వారి నుంచి వివరాలు తీసుకున్నారు వార్డులో ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు కెన్నేటి సుబ్బారెడ్డి, బోని శ్రీనివాస్, పాల్గొన్నారు. అలాగే 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యన్నారాయణ ఆధ్వర్యంలో కొత్తగా మంజూరైన పింఛన్లను ఎంపీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్లు వెంకట రెడ్డి, వంకర బాబూరావు, భాస్కరావు, తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు ఒకే ఒక వినతి

భీమునిపట్నం, జనవరి 8 : భీమిలి జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ఒకే ఒక అర్జీ అందినట్టు జడ్సీ రాము తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు 3వ వార్డులో పైలట్ వాటర్ సప్లై స్కీమ్ మంజూరు చేయాలని వినతి అందించారు. ఆయనతో పాటు పార్టీ నాయకుడు సంజవ్‌కుమార్ ఉన్నారు.

రీడింగ్ రూమ్‌ను పరిశీలించిన రిజిస్ట్రార్

వెంకోజీపాలెం, జనవరి 8 : ఏయూ రీడింగ్ రూమ్‌ను రిజిస్ట్రార్ ఆచార్య ఎం. జేమ్స్ స్టీఫెన్ సోమవారం సందర్శించారు. రూమ్‌లో చదువుకుంటున్న విద్యార్థులతో మాట్లాడారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారితో మాట్లాడి, పరీక్షకు సన్నద్ధమవుతున్న విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. గ్రంథాలయం, రీడింగ్ రూమ్‌లలో నూతనంగా ఏర్పాటు చేసిన వసతులను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

సింహాచలం, జనవరి 8 : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. సంస్కృతం, ఎస్జీటీ, గణితం పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించగా 17 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వారికి కమిటీ సభ్యులు ఇంటర్వ్యూలు జరిపారు. ఎంపికైన వారికి తాత్కాలిక ప్రాతిపదికన రోజుకి రూ.500 చొప్పున చెల్లించనున్నారు.

16వ వార్డులో 'భవిష్యత్తుకు గ్యారంటీ'

వెంకోజీపాలెం, జనవరి 8 : జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోటలో టీడీపీ నాయకులు సోమవారం భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు.వార్డు అధ్యక్షుడు నారు గోపి, జి. అప్పన్న, ముగడ వాసు, పల్లా ఉమారాణి ఇంటింటికి వెళ్లి టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాల గురించి ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమిని గెలిపించాలని కోరారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

బీచ్ రోడ్డు జనవరి 8 : ఆర్‌కే బీచ్‌లో ఉన్న యూత్ హాస్టల్‌లో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం జిల్లాస్థాయి వక్తృత్వ పోటీలు నిర్వహించారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ పోటీల్లో ఏయూ లా కళాశాల విద్యార్థిని హర్షిత దేవగుప్త ప్రథమ స్థానం పొందింది. ఆమెను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

రాష్ట్రస్థాయిలో క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

ఆనందపురం, జనవరి 8 : అనంతపురం జిల్లాలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 4న జరిగిన రాష్ట్రస్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో సాయిగణపతి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 100 మీటర్ల పరుగు పందెంలో ఎస్. ఈశ్వర్ వర్ధన్ బంగారు పతకం, 200, 400 మీటర్ల విభాగాల్లో సిల్వర్ పతకాలు సాధించినట్టు చెప్పారు. షాట్‌పుట్ విభాగంలో కె.లక్ష్మణ్ కాంస్యం, 800 మీటర్ల పరుగు పందెంలో మల్లీశ్వరి సిల్వర్ పతకం సాధించారు. విజేతలను కళాశాల కరస్పాండెంట్ ఎస్. వేణుగోపాల్, తదితరులు అభినందించారు.

వ్యర్థాలకు నిప్పు పెట్టొద్దు : కమిషనర్

వెంకోజీపాలెం, జనవరి 8 : వ్యర్థాలకు నిప్పు పెట్టరాదని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పారిశుధ్య కార్మికులు సమ్మెలో ఉండడంతో వ్యర్థాలు తరలించేందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నామని, ఇప్పటికే తాత్కాలిక సిబ్బందిని, ప్రైవేటు వాహనాలను ఏర్పాటు చేశామని తెలిపారు. వ్యర్థాల తొలగింపులో జాప్యం అవుతున్నందున ప్రజలు సహకరించాలని కోరారు. అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల సమీప ప్రదేశాల్లోని వ్యర్థాలను పోగి చేసి నిప్పు పెట్టడం వల్ల నగరం కాలుష్యంతో నిండి పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి హాని కలుగుతుందన్నారు.

వీర మహిళలకు సముచిత స్థానం : వంశీకృష్ణ


సమావేశంలో మాట్లాడుతున్న వంశీకృష్ణ శ్రీనివాస్

మద్దిలపాలెం, జనవరి 8 : పార్టీ కోసం పనిచేసే వీర మహిళలకు సముచిత స్థానం కల్పిస్తామని జనసేన పార్టీ అర్బన్ అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ చెప్పారు. సోమవారం ఆయన శివాజీపాలెంలోని పార్టీ కార్యాలయంలో వీర మహిళలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ కోసం ఇప్పటివరకు వీర మహిళలు ఎంతో శ్రమించారని, వచ్చే మూడు నెలలు మరింతగా శ్రమించాలని కోరారు. త్వరలోనే పార్టీ కార్యక్రమాల్లో మహిళలు ముఖ్యపాత్ర పోషించే విధంగా కమిటీల్లో స్థానం కల్పిస్తామని చెప్పారు. పార్టీ సిద్ధాంతాలు, విధివిధానాలు ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. ఈ సమావేశంలో పసుపులేటి ఉషాకిరణ్, సుందరపు విజయకుమార్, ఫ్లోర్ లీడర్ భీశెట్టి వసంతలక్ష్మి, కిరణ్‌ప్రసాద్, నాగలక్ష్మి, త్రివేణి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కొమ్మాది, జనవరి 8 : భీమిలి నియోజకవర్గం తనకు జన్మస్థలం వంటిదని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఆయన 6వ వార్డులో రూ. 1.60 కోట్లతో చేపట్టనున్న పలు అభి వృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనకు ఈ నియోజకవర్గంలోనే ఓటుహక్కు ఉందని, ఇక్కడి ప్రజలు తనను రెండుసార్లు ఎమ్మెల్యేగా ఆదరించారని, మరోసారి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముత్తంశెట్టి లక్ష్మీప్రియాంక, గాదె రోసిరెడ్డి, పోతిన ప్రసాదు, పోతిన ఎల్లాజీ, తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తి కథాంశంతో 'రామ్'


విలేకరులతో మాట్లాడుతున్న సూర్య

రామ్‌నగర్, జనవరి 8 : దేశ భక్తి కథాంశంతో రామ్ చిత్రాన్ని రూపొందించామని విశాఖ వాసి, చిత్ర హీరో సూర్య అన్నారు. దీపికా ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై నిర్మాత వడ్లమాని దీపాంజలి నిర్మించిన రామ్ చిత్ర యూనిట్ ప్రమోషన్‌లో భాగంగా నగరంలోని ఒక హోటల్‌లో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్య మాట్లాడుతూ దేశ భక్తి కథతో నిర్మించిన ఈ చిత్రం ఈనెల 26న విడుదల చేయనున్నామని చెప్పారు. హీరోయిన్‌గా ధనియా బాలకృష్ణ, సీనియర్ నటులు సాయికుమార్, శుభలేక సుదాకర్, తదితరులు నటించారని, చిత్రానికి మిహిరామ్ దర్శకత్వం వహించారని చెప్పారు.

పంచ గ్రామాల భూ సమస్య పరిష్కారానికి కృషి

సింహాచలం, జనవరి 8 : పంచ గ్రామాల భూసమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని 98వ వార్డు వైసీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. ఈనెల 5న విజినిగిరిపాలెంలో జరిగిన గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమంలో తమ ఇబ్బందులను ఎమ్మెల్యేకు ప్రజలు చెప్పుకున్నారు తప్ప అడ్డుకోలేదన్నారు.


గుడిలోవ విజ్ఞాన్ విహార‌లో విద్యార్థుల వేషధారణలు


పాత వెంకోజీపాలెం జీవీఎంసీ పాఠశాలలో జరిగిన వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు

పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు

వెంకోజీపాలెం, జనవరి 8 : తూర్పు, భీమిలి నియోజకవర్గాల్లోని పలు పాఠశాలల్లో సోమవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు పలు వేషధారణలతో ఆకట్టుకున్నారు.15వ వార్డు పాత వెంకోజీపాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో హరిదాసు మేలుకొలుపు, రంగు రంగుల ముగ్గులు, చెరుకు గడలు, సంక్రాంతి పాటలతో విద్యార్థులకు పండుగ విశిష్టతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ జ్యోతి, పాధ్యాయులు రమాదేవి, శ్రీలక్ష్మి, అరుణ, రాము, జగన్ పాల్గొన్నారు. హెచ్‌బీ కాలనీలోని శారదా విద్యా నిలయంలోనూ సంబరాలు నిర్వహించారు.

దేవస్థానం హైస్కూల్లో..

సింహాచలం : సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలోని ఉన్నత పాఠశాలలోనూ సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు ముగ్గుల పోటీ నిర్వహించారు. అలాగే గొబ్బెమ్మలు ఏర్పాటు చేసి వాటి చుట్టూ తిరుగుతూ పాటలు పాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం భాను, టీచర్లు పాల్గొన్నారు.

కొమ్మాది : తెలుగు ప్రజలు ఎంతో ఆనందంగా జరుపుకొనే పండుగ సంక్రాంతి అని చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రిన్సిపాల్ సందీప్ అన్నారు. బక్కన్నపాలెం రహదారిలో ఉన్న పాఠశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరావు, దుర్గ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

ఆనందపురం: గుడిలోవలోని విజ్ఞాన్ విహార 44వ వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి ప్రదర్శించిన విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. కూచిపూడి, భరతనాట్యం, మణిపూర్ సంప్రదాయ నృత్యం, తదితర వాటిని అద్భుతంగా ప్రదర్శించారు. అలాగే సంక్రాంతి సంబరాలను కళ్లకు కట్టినట్టు జానపద నృత్య రూపకంలో చూపించారు.

తగరపువలస : బంగ్లామెట్ట పాఠశాలలోనూ సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అప్పలరాజు, ఉపాధ్యాయులు రమేష్, నాగమణి, మల్లిక, విద్యా కమిటీ చైర్‌పర్సన్ మానస తదితరులు పాల్గొన్నారు.

పెదవాల్తేరు : ఈస్టుపాయింట్ కాలనీలో ఉన్న గాయత్రి విద్యా పరిషత్ ఎంఎల్‌బీటీ పాఠశాలలోనూ సంక్రాంతి సంబరాలు జరిగాయి. ప్రముఖ విద్యావేత్త ఆచార్య డి. సరిత ఈ వేడుకలను ప్రారంభించారు.


విద్యార్థితో మాట్లాడుతున్న అధికారులు

15 రోజుల్లో సమస్యలు పరిష్కారం

» విద్యార్థులకు సాంఘిక సంక్షేమ శాఖాధికారుల హామీ

ఆరిలోవ, జనవరి 8 : చినగదిలి తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ పీజీ వసతి గృహంలో నెలకొన్న సమస్యలను 15 రోజుల్లో పరిష్కరిస్తామని ఆ శాఖాధికారులు విద్యార్థులకు హామీ ఇచ్చారు. వసతి గృహంలోని సమస్యలపై విద్యార్థులు ఆదివారం ధర్నా నిర్వహించిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన అధికారులు, వార్డెన్, ఆరిలోవ ఎస్ఐ సూర్యనారాయణ సోమవారం వసతిగృహాన్ని సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు.ఈ సందర్భంగా విద్యార్థులు వారికి పలు సమస్యలను ఏకరువు పెట్టారు. ప్రస్తుతం ఇక్కడ వంద మంది వరకు ఉంటున్నామని, నాలుగు నెలల నుంచి తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని చెప్పారు. మరుగుదొడ్లకు తలుపులు లేవని, భోజనం కూడా సరిగ్గా ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో నీటి సౌకర్యం కల్పించేందుకు 45 రోజులు చికెన్ కట్ చేశారని, ఆ డబ్బుతో నీరు అందిస్తామని చెప్పినా ఇంతవరకూ ఏర్పాటు చేయలేదన్నారు. డిప్యూటేషన్‌పై మధురవాడకు చెందిన వార్డెన్ వస్తున్నారని, పూర్తిస్థాయి వార్డెన్ నియమించాలని కోరారు. దీనిపై స్పందించిన అధికారులు 15 రోజుల్లో అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

అధ్వానంగా పెంట - కొవ్వాడ రహదారి


గోతులతో ఉన్న రహదారి

పద్మనాభం (రూరల్), జనవరి 8 : మండలంలోని పెంట గ్రామం నుంచి అలమండ ఆర్‌ఎస్ వరకు ఉన్న 15 కిలోమీటర్ల రహదారి పూర్తిగా గోతులతో నిండిపోయింది. రోడ్డు మార్జిన్లు కోతకు గురవ్వడంతో ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల తుఫాన్ వల్ల కురిసిన వర్షాలకు రోడ్డుతో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. రోడ్డు ఇరుగ్గా ఉండడం, బెర్మ్‌లు లేకపోవడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు.

మొక్కజొన్న సాగుపై రైతుల ఆసక్తి


అనంతవరంలో సాగు చేస్తున్న పంట

పద్మనాభం (రూరల్), జనవరి 8 : మండలంలోని రైతులు మొక్కజొన్న సాగుపై ఆసక్తి చూపుతున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే పంట కావడంతో అనంతవరం, పెంట, బాందేవుపురం, వీకేపాలెం, పద్మనాభం, అర్జుకునిపాలెం, ఇసకలపాలెం, కృష్ణాపురం గ్రామాల్లోని రైతులు ఈ పంటను అధికంగా సాగు చేస్తున్నారు. ఈ గ్రామాల్లో ఏడాదికి మూడుసార్లు రైతులు ఈ పంట వేస్తున్నారు. వరి పూర్తయిన వెంటనే మొక్కజొన్నను ప్రధాన పంటగా ఎంపిక చేసుకుంటున్నారు. చీడపీడలు తక్కువగా రావడం, మార్కెట్‌లో మంచి గిరాకీ ఉండడంతో ఎక్కువ విస్తీర్ణంలో సాగుకు ఆసక్తి చూపుతున్నారు.

ప్రమాదకరంగా పాఠశాల భవనం


శ్లాబ్‌ను చూపిస్తున్న నాయకులు

భీమునిపట్నం, జనవరి 8 : జీవీఎంసీ 4వ వార్డు సోమన్నపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆ వార్డు టీడీపీ అధ్యక్షుడు పాసి నరసింగరావు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల భవనం పూర్తిగా శిథిలమైనా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పిల్లలకు ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. గతంలోనూ భవనం దుస్థితిపై అధికారులకు విన్నవించామని కానీ ఎవరూ పట్టించుకోలేదన్నారు. తక్షణమే భవనం మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గరికిన ఎల్లయ్య, శీరపు రమణ, మరుపిళ్ల రాజేంద్రప్రసాద్, తొత్తడి సూర్య, పోతిన రాము పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న బీఎస్ఎన్ఎల్ జీఎం

సింహాచలం, జనవరి 8 : బీఎస్ఎన్ఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ మురళీ మోహన్ పసుపులేటి సతీసమేతంగా సోమవారం వరాహలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. ఆయనకు దేవాలయ అధికారులు ఆహ్వానం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకున్న ఆయన గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి దర్శనం అనంతరం పండితులు వేదాశీర్వచనాలీయగా అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

విద్యానగర్ కాలనీలో మ్యాన్‌హోల్ లీకేజీ


రోడ్డుపై మురుగు నీరు

పెదవాల్తేరు, జనవరి 8 : జీవీఎంసీ 21వ వార్డు పాత సీబీఐ డౌన్ విద్యానగర్ కాలనీ సచివాలయం సమీపంలో మ్యాన్‌హోల్ లీకవుతోంది. దీంతో రోడ్డు మొత్తం మురుగు నీరు ప్రవహిస్తుండడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. వారం రోజులుగా ఈ పరిస్థితి ఉన్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు.

బస్టాప్‌లో ఆటోలు

మద్దిలపాలెం, జనవరి 8 : మద్దిలపాలెం బస్టాప్‌లో ఆటోలు నిలుపుతుండడం నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. బస్టాప్‌కు దగ్గరలోనే ట్రాఫిక్ సిబ్బంది, ఆర్టీసీ అధికారులు ఉన్నా.. పట్టించుకోవడం లేదు. జాతీయ రహదారిపై ఇసుకతోట నుంచి రామా టాకీస్ వెళ్లే దారిలో మద్దిలపాలెం సిగ్నల్‌కు ముందు ఒక బస్టాప్ కూడలి తర్వాత సత్యం జంక్షన్‌కు వెళ్లే దారిలో ఒక బస్టాప్, సత్యం నుంచి ఇసుకతోటకు వెళ్లే దారిలో మద్దిలపాలెం ఆర్టీసీ డిపో వద్ద బస్టాప్ ఉన్నాయి. ఈ మడుఉ స్టాప్‌లలో ప్రయాణికుల రద్దీ తీవ్రంగా ఉంటుంది. అయితే ఆటో డ్రైవర్లు ప్రయాణికుల కోసం బస్టాప్‌లలో ఆటోలను నిలుపుతున్నారు. దీంతో బస్సులు బస్టాప్‌లోకి వచ్చే వీల్లేక రోడ్డు మధ్యలో ఆపుతున్నారు. దీనివల్ల రహదారిలో ట్రాఫిక్ స్తంభిస్తోంది. బస్టాప్‌లకు కూత వేటు దూరంలోనే ట్రాఫిక్ అవుట్ పోస్ట్ సిబ్బంది, ఆర్టీసీ సిబ్బంది ఉన్నా.. స్పందించకపోవడంతో ప్రతిరోజూ వాహనదారులు అవస్థలు పడుతున్నారు.


మద్దిలపాలెం బస్టాప్‌లో నిలిపిన ఆటోలు